
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747

# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States



ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గా ఆలూరి రమేష్ –అమరావతి, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :

సంపుటి : 24 | సంచిక : 3 | ది. 25-2-2025 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

# 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తాం

- రాష్ట్రంలో పేదరికం నిర్మూలించేందుకు కట్టుబడి ఉన్నాం
- కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం
- యువతకు మెరుగైన శిక్షణ ఇవ్వాలనేది మా విధానం
- ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అనేక పథకాలు
- ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్







**వెలగపూడి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి తిరుగులేని మెజారిటీ ఇచ్చారని, ప్రజల కోరిక మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటైందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైందని, గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని గవర్నర్ వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నామన్న గవర్నర్, అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ దస్త్రంపై సంతకం చేశామని, అన్న క్యాంటీన్లు తెచ్చి పేదవాళ్ల ఆకలి తీరుస్తున్నామని తెలిపారు.

**తలసరి ఆదాయం పెరిగింది :** కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామన్న గవర్నర్, తమ ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగిందని చెప్పారు. అవకాశాలిస్తే ప్రతి ఒక్కరూ మెరుగైన సేవలు అందిస్తారని అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తామని వెల్లడించారు. ప్రతినెలా 1వ తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని, పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, మౌలికవసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్న గవర్నర్, బీసీవర్గాలు సమాజానికి వెన్నెముక అని వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. స్థానికసంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు గుర్తు చేశారు.

**టూరిజంలో పెరిగిన పెట్టుబడులు :** 'మన బడి - మన భవిష్యత్తు' ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని గవర్నర్ తెలిపారు. మెరిట్ ఆధారంగా 9 వర్సిటీలకు వీసీలను నియమించామని, స్థానికసంస్థల్లో పోటీకి ఇద్దరు పిల్లలే ఉండాలన్న నిబంధన ఎత్తివేశామని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించామని, ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల్లో 200 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఉండాలనేది సీఎం ఆకాంక్ష అని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో టూరిజంలో పెట్టుబడులు పెరిగాయని గవర్నర్ నజీర్ అన్నారు. ఎంఎస్ఎంఈలకు అండగా ఉన్నామని, అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా అనేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

**రాయలసీమలో కరవు అనేదే ఉండదు :** తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలకు నీరందించేలా కార్యక్రమాలు చేపట్టామని, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం-బనకచర్ల పూర్తయితే రాష్ట్ర రూపురేఖలు మారతాయని, రాయలసీమలో కరవు అనేదే ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల పాలనతో రాష్ట్రం ఆర్థిక పతనం అంచుకు చేరిందన్న గవర్నర్, రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని 7 శ్వేతపత్రాల ద్వారా ప్రజలకు తెలిపామని గుర్తుచేశారు. గత ఐదేళ్ల పాలనలో వనరుల మళ్లింపు, సహజవనరుల దోపిడీ జరిగిందని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో ఎక్సైజ్, ఇసుకలో లోపభూయిష్ట విధానాలు జరిగాయన్న గవర్నర్, ప్రభుత్వ పన్నులను సైతం దారి మళ్లించారని చెప్పారు. వైఎస్సార్సీపీ పాలన వల్ల రాష్ట్రం 25 ఏళ్ల ఆదాయాన్ని కోల్పోయింది. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నాం. ప్రజల కోసం ఉచిత ఇసుక పాలసీ విధానం తెచ్చాం. సుపరిపాలన ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తెస్తున్నాం. మా ప్రభుత్వం 8 నెలల్లోనే గణనీయ-ౖమైన పురోగతి సాధించింది. గతప్రభుత్వం నిలిపిన 93 కేంద్ర పథకాల్లో 74 పథకాలు పునరుద్ధరించాం. నీటిపారుదల, రోడ్ల సంబంధిత రూ.10,125 కోట్ల బిల్లులు క్లియర్ చేశామని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చెప్పారు.

**రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు:** రూ.2,488 కోట్ల ఆర్థికసంఘం గ్రాంట్‌తో స్థానిక పాలన బలోపేతం చేశామని గవర్నర్ నజీర్ తెలిపారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించామని, విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు హామీలు నెరవేర్చామని గుర్తు చేశారు. సుస్థిర వృద్ధికి దోహదపడే 22 కొత్త విధానాల ద్వారా బలమైన పునాది వేశామన్న గవర్నర్, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టాటా పవర్ కంపెనీలను ఆకర్షించినట్లు తెలిపారు. గ్రీన్‌కో గ్రూప్, బీపీసీఎల్, టీసీఎస్ కంపెనీలను ఆకర్షించామని, ఇన్వెస్టర్లు ఇప్పటివరకు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. ఆయా పెట్టుబడుల ద్వారా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.16 లక్షల కోట్లకు విస్తరించిందన్నారు.

**కందుకూరి వ్యాఖ్యలు ప్రస్తావించిన గవర్నర్:** తలసరి ఆదాయం కూడా రూ.2.68 లక్షలకు పెరిగిందని, వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు వృద్ధి చెందాయని అన్నారు. ఈ సందర్భంగా సంఘ సంస్కర్త కందుకూరి వ్యాఖ్యలను గవర్నర్ ప్రస్తావించారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుందని, అవకాశమిస్తే బయటకు వస్తుందని చెప్పారు. తమ ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 దిశగా వెళ్తోందని, సమాజ అభివృద్ధికి సంక్షేమం, అభివృద్ధి కలిసికట్టుగా వెళ్లాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలనేదే తమ విధానమని స్పష్టంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఐటీ విప్లవానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని కొనియాడారు. అమెరికాలోని ప్రవాస తెలుగువాళ్ల తలసరి ఆదాయం ఎక్కువని తెలిపారు. ప్రస్తుతం ఏపీ మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోందని, పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిలో ఏఐను వినియోగిస్తున్నామని చెప్పారు.

## టీడీపీకి బిగ్ షాక్.. అత్యంత కీలక వ్యక్తి రాజీనామా



**అమరావతి, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాకముందే అనూహ్య షాక్ తగిలింది ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి, టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి జీవిరెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం తన రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి పంపించారు. లేఖలో పలు కీలక అంశాలు ప్రస్తావించారు. "వ్యక్తిగత కారణాలతో, నేను తెలుగు దేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వం, జాతీయ అధికార ప్రతినిధి హోదా, మరియు ఏపీ స్టేట్ ఫైబర్నెట్ లిమిటెడ్ చైర్మన్ పదవుల నుండి రాజీనామా చేస్తున్నాను. మీరు నాపై ఉంచిన విశ్వాసానికి, అందించిన మద్దతుకు, మరియు నాకు ఈ కీలకమైన బాధ్యతలను నిర్వహించే అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలుగు దేశం పార్టీ మరింత బలంగా ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నాను. ఇక మీదట పూర్తిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతాను మరియు భవిష్యత్తులో ఎటువంటి రాజకీయ పార్టీలో చేరే ఉద్దేశం లేదు' అని రాజీనామా లేఖలో జీవిరెడ్డి పేర్కొన్నారు.

## అసెంబ్లీకి హాజరు కాకూడదని జగన్ నిర్ణయం

- వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కీలక భేటీ
- వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న జగన్
- తాను మరో 30 ఏళ్లు రాజకీయాల్లో ఉంటానని ధీమా
- 2028 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు వస్తాయని వెల్లడి



**అమరావతి, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఏపీ బడ్జెట్ సమావేశాలను బహిష్కరించాలని వైసీపీ అధినేత జగన్ నిర్ణయించారు. ఈరోజు జగన్, ఇతర వైసీపీ సభ్యులు అసెంబ్లీకి హాజరైన సంగతి తెలిసిందే. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ సభలో ఆ పార్టీ సభ్యులు నిరసన చేపట్టారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత తాడేపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలకు మనం హాజరుకావడం లేదని తెలిపారు. మరో 30 ఏళ్లు తాను రాజకీయాల్లో ఉంటానని... తనతో పాటు ఉండేవాళ్లే తనవాళ్లు అని చెప్పారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా ప్రజల్లోకి వెళ్లి పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. 2028 ఫిబ్రవరిలో జమిలి ఎన్నికలు వస్తాయని చెప్పారు.

## అలాగైతే జగన్ జర్మనీ వెళితే బాగుంటుంది: పవన్ కల్యాణ్

- ప్రతిపక్ష హోదా ఇవ్వలేదంటూ జగన్, వైసీపీ ఎమ్మెల్యేల వాకౌట్
- మీడియా పాయింట్ వద్ద సెటైర్లు వేసిన పవన్ కల్యాణ్



**అమరావతి, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ప్రతిపక్ష హోదా ఇస్తేనే ఏపీ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతామని జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు ఇవాళ సభ నుంచి వాకౌట్ చేయడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం ప్రకారం ప్రతిపక్ష హోదా ఇచ్చే నిబంధన మన భారత రాజ్యాంగంలో లేదని అన్నారు. అలాగైతే జగన్ జర్మనీ వెళితే బాగుంటుందని ఎద్దేవా చేశారు. జర్మనీలో ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం ఆధారంగా చట్టసభల సీట్లు కేటాయిస్తుంటారని, ఒకవేళ ఒక పార్టీకి 5 శాతం కంటే తక్కువ ఓట్లు వస్తే... ఆ ఓట్లను ఇతరులు పంచుకుంటారని పవన్ వివరించారు. జగన్ ఇంకా ప్రతిపక్ష హోదా కోసం మంకుపట్టు పడితే జర్మనీ వెళితే సరి అని పవన్ వ్యాఖ్యానించారు.

## తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవాలి

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీనేతలతో మంత్రి లోకేష్ సమీక్ష.



**అమరావతి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓట్లతోనే కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో ఘన విజయం సాధించాలని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ సీనియర్ నేతలతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రచారానికి అతితక్కువ సమయం మాత్రమే ఉండటంతో టెక్నాలజీ వినియోగం ద్వారా ప్రతిఓటరును అభ్యర్థించాలని అన్నారు. ఎన్నికల ముందురోజు శివరాత్రి పండుగ నేపథ్యంలో ప్రతి ఓటరు పోలింగ్ బూత్ లకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా ఇన్ చార్జి మంత్రులు, శాసనసభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల రోజు పరిస్థితిని ఎప్పటికప్పుడు కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించేందుకు వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూటమి నాయకులంతా కలసికట్టుగా పార్టీ అభ్యర్థుల ఘన విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, జోనల్ కోఆర్డినేటర్లు సుజయకృష్ణ రంగారావు, ఎం.వి సత్యనారాయణ రాజు, దామచర్ల సత్య, మందలపు రవి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల మధ్య విభేదాలు మీడియా పై రుద్దొద్దు..

- ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ఒకరిని అక్కున చేర్చికోవడం.. మరొకరిని పక్కకు నెట్టడం సమంజసం కాదు!
- రాజకీయ పార్టీల మధ్య విబేధాలు, మీడియా పై రుద్దొద్దు
- ఇది గౌరవ సభేనని పక్షపాత ధోరణి విడనాడి చాటి చెప్పండి
- ఫ్రెండ్లీ ప్రభుత్వం అంటూ ప్రాంతీయ పత్రికలను పూర్తిగా పక్కన పెట్టడం దారుణం
- ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ డిమాండ్

**విజయవాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** అసెంబ్లీ కవరేజికి అన్ని మీడియా లకు అవకాశం ఇవ్వాలని ఒకరిని అక్కున చేర్చికొని మరొకరిని పక్కకి నెట్టడం మీడియా ని అవమానించడమే అవుతుందని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు తెదేపా ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఇది యావత్తు విలేకరుల సమాజాన్ని అవమానించడమే అవుతుందని ఏ.పి ఎమ్ పి ఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, ఉపాధ్యక్షులు యేమినేని వెంకట రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి మల్లిఖార్జునరావు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పసుపులేటి చైతన్య, విజయవాడ నగర అధ్యక్షులు తాళ్ళూరి అనీల్ కుమార్, ఉపాధ్యక్షులు రాజా, ప్రశాంత్, కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు,ఎన్.ఎస్.ఆర్.లు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల కవరేజికి కొన్ని పత్రికల, చానళ్ల,రిపోర్టర్లను అనుమతించకపోవడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. ఏ రాజకీయ పార్టీల నాయకులు సభలు సమావేశాలు ఏ సమయంలో పెట్టినా సామాజిక బాధ్యతగా పరుగులు తీసి ప్రజలకు వార్తలు అందించే విలేకరులను విభజించి దూరం చేయడం సరైనది కాదని వారా ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగంలో చట్టసభలకు అత్యున్నత గౌరవం ఉందని, అదే విధంగా పత్రికా రంగానికి కూడా నాలుగో స్థంభంగా కీలకస్థానం ఉందని, శాసనసభ కవరేజికి అన్ని పత్రికల చానళ్ల విలేఖరులకు అవకాశం ఇవ్వాల్సి ఉండగా కొందరికి అనుమతి ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం విచారకరమని వారు ప్రభుత్వంని సలహా ఇచ్చారు. మీడియా పట్ల అలాంటి పక్షపాత ధోరణులు కొనసాగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని యూనియన్ నాయకులు ఆ ప్రకటనలో అభిప్రాయ పడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అలాంటి నిర్ణయం తీసుకుంటారని తాము ఊహించలేదని, అపారమైన రాజకీయ అనుభవం, ప్రజాస్వామ్య పరిణతి కలిగిన సభాపతి తమ నిర్ణయాన్ని పునరాలోచించాలని రాష్ట్ర చరిత్ర కి కళంకిత చర్యలు తగదని ఏ పి ఎమ్ పి ఏ నాయకులు హితవు పలికారు. గతంలో వైఎస్ ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో కొన్ని పత్రికలు , ఛానెళ్ల ప్రతినిధులకు శాసనసభ కవరేజికి అవకాశం నిరాకరించడం జరిగిందని , అవే తప్పులను కూటమి ప్రభుత్వం కొనసాగించడం 2024 ఎన్నికల తీర్పులోని ప్రజాస్వామ్యస్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి అధికారిక సమావేశాలకు కూడా కొన్ని పత్రికలు చానల్స్ ను పిలవకపోవడం తగదన్నారు. గౌరవ శాసనసభ స్పీకర్, ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునః పరిశీలించి మీడియా ప్రతినిధులు అందరికీ అవకాశం ఇవ్వాలని , రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, అసెంబ్లీ సమావేశాలకు అన్ని చానల్స్,పత్రికల కు అనుమతి ఇవ్వాలని ఇలాంటి పరిస్థితి ముందు ముందు రాకుండా ఇది ముమ్మాటికీ గౌరవ సభే నని ప్రభుత్వం చాటి చెప్పే విధంగా తమ పక్షపాత ధోరణి విడనాడాలని సోమవారం ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్.



**కూకట్ పల్లి,ఫిబ్రవరి 24(వార్తాప్రభ):**ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పోట్రూ సందర్శించారు. సోమవారం పాఠశాలలో ని ఏ1వన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ల్యాబ్ ను జిల్లా విద్యాధికారి విజయ కుమారితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు సిలబస్ వివరాలు అడిగి తెలుసుకుని విద్యార్థులకు చదువు గొప్పతనం వివరించి,వారిలో ఆత్మస్థైర్యం నింపారు.కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధా పద్మజ, పిఎస్ హెడ్మాస్టర్ అనసూయ, ఏ ఎం ఓ రవీందర్ రాజు,ఏపిసి స్కూల్ చైర్మన్ దుర్గాభవాని, ఉపాధ్యాయులు మోహన్ రావు,సీతాలక్ష్మి,సిద్దయ్య, విటల్ గౌడ్,శ్రీనివాస్,కిరణ్మయి, విజయలక్ష్మి,సుధారాణి, గోవిందు,గొడుగు శ్రీనివాస్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## టిడబ్ల్యుజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం

**కలెక్టర్ కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించిన ఫెడరేషన్ నాయకులు, విలేకరులు**





**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) :** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫెడరేషన్ నాయకులు విలేకరులు కలిసి నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎల్లంపల్లి పద్మారెడ్డి, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు గడ్డమీది అశోక్, జగదీష్ మాట్లాడుతూ... ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుండా అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సమస్యలను పరిష్కరించకుండా జాప్యం చేస్తుందని ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు తీర్పు సాకుతో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం, కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు ఇంత వరకు ఇవ్వకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం దుర్మార్గమని అన్నారు. జర్నలిస్టుల పట్ల గత ప్రభుత్వ మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా చిన్న చూపు చూడకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విలేకరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే**



**ఆసిఫాబాద్ ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎం.ఎల్.సి. ఎన్నికలలో భాగంగా ఈ నెల 27వ తేదీన జిల్లాలో జరుగనున్న పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ నియోజకవర్గ ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియ కొరకు నియమింపబడిన ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఎం.ఎల్.సి. ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా పర్యవేక్షించాలని, ప్రిసైడింగ్ అధికారి డైరీ పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 26వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో సామాగ్రి పంపిణీ కేంద్రానికి చేరుకోవాలని, సకాలంలో రిపోర్టు చేసి పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సామాగ్రి, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సులను పరిశీలించి కేటాయించిన ప్రకారం ఉన్నవాటి వివరాలు సరి చూసి తీసుకోవాలని తెలిపారు

# రాష్ట్ర స్థాయిలో కబడ్డీ విజేతగా భద్రాద్రి జిల్లా బాలికల జట్టు

**అభినందించిన జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చీకటి కార్తీక్**





భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 24 (వార్తాప్రభ) కొత్తగూడెం, వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 34వ సబ్ జూనియర్ అంతర్రాష్ట్ర బాలబాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీల్లో ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్ లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు సత్తా చాటింది. కాగా వారిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చీకటి కార్తీక్ అభినందించారు. వారికి మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీకటి కార్తీక్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలోని క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి రాష్ట్ర స్థాయిలో సత్తా చాటేలా చేసేందుకు కృషి చేస్తున్నామని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహాయంతో జిల్లాలోని కబడ్డీ క్రీడాకారులకు సింథటిక్ మ్యాట్ తో కూడిన కబడ్డీ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో భవిష్యత్ లో మంచి హోదాతో కూడిన ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, జాతీయ స్థాయిలో రాణించి భద్రాద్రి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ – భద్రాద్రి జిల్లా సెక్రటరీ కె స్వాతిముత్యం, ట్రెజరర్ నరేష్, కోచ్ సిహెచ్ రాంబాబు, వెంకట్, యూత్ కాంగ్రెస్ నాయకులు గులాం మతిన్, కుంచం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ సందర్భంగాప్రచారం నిషేధం.

- 48 గంటలపాటు సైలెన్స్ పీరియడ్
- ఎన్నికలు పూర్తయ్యే వరకు144 సెక్షన్ అమలు
- బల్క్ ఎస్ఎంఎస్ లు పంపడం నిషేధం.
- ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** ఈ నెల 27న జరిగే నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్ )అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. సైలెన్స్ పీరియడ్ లో భాగంగా 25.02.2025 సాయంత్రం 4.00 గంటల నుండి 27.02.2025సాయంత్రం 4.00 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం, ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించడం జరిగిందని అన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని సైలెన్స్ పిరియడ్ లో ఎవరు కూడా రాజకీయపరమైన ఎస్.ఎం.ఎస్ లు, బల్క్ ఎస్ఎంఎస్ లను పంపకూడదని, బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించకూడదని, ప్రచారం చేయరాదని కలెక్టర్ సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సైలెన్స్ పీరియడ్ లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తనా నియమావళి 1961 ప్రకారం జారీ చేయబడిన సూచనలు,ఆదేశాల మేరకు బాధ్యులపై చర్యలు




తీసుకోవడం జరుగుతుందని అన్నారు.48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరు కూడా జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. ఎఫ్ఎస్టి, ఎంసీసీ, టీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికలు నిర్వహించే ఆయా జిల్లాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు

# బీసీల పెన్నిధి రేవంత్ రెడ్డి -కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ):**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.కులగనణ మరియు (42)% బిసి రిజర్వేషన్ చట్టబద్ధత చేపడుతున్న తరుణంలో యాదవ కుల బాంధవులతో వివిధ జిల్లాల నుండి మరియు హైదరాబాద్ లోని జంట నగరాల నుండి యాదవ బంధువులతో పెద్దఎత్తున కుల గణన మరియు (42)% బీసీ రిజర్వేషన్ చట్టబద్ధత చేపట్టడం జరిగిందనీ, బీసీల పాలిట బాంధవుడిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కొనియాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద(2)వ సామాజిక వర్గముగా అయినటువంటి యాదవులకు ఈ రిజర్వేషన్ వలన విద్య,వైద్య, ఉద్యోగ సామాజిక ఆర్థిక రాజకీయంగా రంగాలు ఈ రిజర్వేషన్ వల్లే సాధ్యమవుతాయని యాదవ పెద్దలు తెలియజేశారు.అనంతరం మల్లికార్జున కర్గే,రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ తదితర జిల్లా అధ్యక్షులు,సభ్యులు,మహిళ అధ్యక్షురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# వారికే పదే పదే కండువాలు కప్పి బిఆర్ఎస్ పార్టీ లో చేరిక అంటే ఎట్లా..?

- కార్యకర్తలకే మళ్లీమళ్లీ గులాబి కండువాలు కప్పిన దౌర్భాగ్య పరిస్థితి ఇంకొకటి ఉండదు
- మాయమాటలు చెప్పి ఇంకెంతకాలం అమాయక ప్రజలను మోసగిస్తావు ఎమ్మెల్యే?
- కాంగ్రెస్ సీనియర్ నాయకుల, కార్యకర్తల ఆగ్రహం

**కూకట్ పల్లి,ఫిబ్రవరి 24(వార్తాప్రభ):**కూకట్ పల్లి నియోజకవర్గం అమాయక ప్రజలను ఇంకా ఎంతకాలం మోసగిస్తావు, ఇక నీ మోసాలు, ఆటలు సాగనీయకుండా అడుగడుగునా అడ్డుపడుతూ అమాయక ప్రజలను మేల్కొలిపే కార్యక్రమాలను చేపడతామని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బాలానగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనేతల సమావేశంలో నేతలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్, కూకట్పల్లి మున్సిపల్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ మల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలానగర్ డివిజన్ కు చెందిన అనేకమంది బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు చెప్పుకుంటున్న కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పచ్చి అబద్ధాలు ఆడుతున్నాడని, కేవలం నలుగురు కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే బిఆర్ఎస్ కండువా కప్పుకున్నారని స్పష్టం చేశారు.పుట్టపాక మధు ఇటీవలే చిల్లర దందాలు చేస్తూ, స్థానిక గుడిసె వాసుల వద్ద నుండి పెద్ద మొత్తంలో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని, ఇలాంటి చర్యలు కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు తెస్తాడని ముందుగానే గ్రహించి కాంగ్రెస్ పార్టీ నుండి తొలగించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఆటలు సాగవని తొలగించడంతోనే నలుగురిని వెంటేసుకుని పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేరుతున్నట్లు ప్రకటించుకున్నాడని ఎద్దేవా చేశారు. దీనికి ఎమ్మెల్యే




సమర్థించి చిల్లరగాళ్లను సంకనెక్కించుకుని ఓ పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ లో చేరుతున్నట్లు మీడియాలో ప్రకటించుకోవడం సిగ్గుమాలిన పని ఇంకొకటి లేదని అన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన వాళ్లకే మళ్ళీ బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు అదే కార్యకర్తలకు మళ్లీమళ్లీ గులాబీ కండువా కప్పిన దౌర్భాగ్య పరిస్థితి ఇంకొకటి ఉండదని వ్యంగ్యంగా విమర్శించారు. ఎమ్మెల్యేకు ఇంతటి దౌర్భాగ్య పరిస్థితిపట్టడం ఆలోచించదగ్గ విషయమని అన్నారు. కార్పొరేటర్లు వెంటేసుకుని బొందలగడ్డలు తిరుగుతున్న ఎమ్మెల్యేకు రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించి కార్పొరేటర్లను బొంద పెట్టే పరిస్థితి వస్తుంది కాచుకో అంటూ సవాల్ విసిరారు. నియోజకవర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అవి సరిపోవట అని తీవ్రంగా ఆగ్రహించారు. అభివృద్ధికి నిధులు కావాలా లేక సరిపోతలేవని సాకు చెప్పడం ఒక్కటే ఎమ్మెల్యే నేర్చుకున్నాడని అన్నారు.

# గౌతమ్ నగర్ లో మంచినీటి సమస్యను మెరుగుపరచండి



**- జలమండలి అధికారులకు ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి వినతి**

**మల్కాజిగిరి : ఫిబ్రవరి 24(వార్తాప్రభ):**గౌతమ్ నగర్ డివిజన్లో అన్ని కాలనీలలో మంచినీటి సమస్యను మెరుగుపరచాలని కోరుతూ జలమండలి జీఎం అశోక్ రెడ్డిని మల్కాజ్గిరి శాసనసభ్యుకు రాజశేఖర్ రెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ సోమవారం వినతి పత్రం సమర్పించారు. వేసవి కాలం కాబట్టి గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు ఇందుకోసం మహేంద్ర హిల్స్ లో ఉన్న రిజర్వాయర్ నుండి నీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచి ఎక్కువసేపు నీళ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు అలాగే గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో బోర్లు మరమ్మతులు చేయాలని తెలిపారు.

## వార్తా ప్రభ

# హైదరాబాద్

## డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్- ట్రాఫిక్ ఎస్ఐ నరేష్




**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)**లైసెన్సులు లేని వారికి రవాణా శాఖ అధికారులతో సమన్వయం పాటిస్తూ లైసెన్సులు తీసుకునే విధంగా చర్యలు చేపడుతున్న కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసులు తెలిపారు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పీ రెహమాన్ సూచనలతో సోమవారం నుండి కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు లైసెన్సులు లేకుండా ఆటోలను నడుపుతున్న రామవరం, సూపర్ బజార్,లక్ష్మీదేవిపల్లి,సుజాతనగర్ అడ్డా లకు చెందిన 5 గురు డ్రైవర్లకు జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో లెర్నింగ్ లైసెన్స్ లను ఇప్పించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ నరేష్ తెలియజేశారు.డ్రైవింగ్ లైసెన్సులు పొందడానికి అర్హతలు కలిగి ఉండి లైసెన్సులు తీసుకోకుండా వాహనాలు నడిపే వారిపై ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు

## పరం పర స్వీట్ షాప్ శుభారంభం



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ):**మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పరంపర స్వీట్ షాప్ ను ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వెంగల్ రావు,నీలం రవీందర్ ముదిరాజ్ పరంపర స్వీట్ షాప్ అధినేత సుప్రజ ప్రవీణ్,నాయకులు మిరియాల రాఘవరావు,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో రాణించాలి - కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ):**చందానగర్ డివిజన్ లోని స్కాలర్స్ నెస్ట్ గ్లోబల్ స్కూల్ మరియు తుషార్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి..ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అందరిని అలరించాయి.ఈ సందర్భంగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థులకు బాల్యం నుంచే నాణ్యమైన విద్యను అందించాలని వారిలో ధైర్యం ఆత్మవిశ్వాసం పేరిగేల భోదనలు ఉండాలన్నారు. .అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తల్లిదండ్రులు,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన యూనియన్ అధ్యక్షులు కట్ట రాంకుమార్

**బెల్లంపల్లి ఫిబ్రవరి 24 (వార్తాప్రభ):**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మంచిర్యాల జిల్లా పర్యటన సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షులు కట్ట రామ్ కుమార్ ను అరెస్టు చేసిన బెల్లంపల్లి 1వ పట్టణ పోలీసులు ఈసందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు కట్ట రాంకుమార్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఆటో డ్రైవర్ల ఉద్యమాన్ని ఆపలేరు అని అన్నారు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చే వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు, మహాలక్ష్మి పథకం ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఫ్రీ ఇవ్వడం వల్ల ఉపాధి కోల్పోయి కుటుంబ పోషణ భారమై ఆత్మహత్యలు చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు 20 లక్షల రూపాయలు, ప్రతి ఆటో డ్రైవర్ కు సంవత్సరానికి 12,000, ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, ఇండ్లు లేని ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పై మంచిర్యాల వేదికగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికే రాష్ట్రమంతా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కనిపించడం లేదా ఆటో డ్రైవర్ల ఓట్లు వారికి అవసరం లేదా ఇంతే మొండి వైఖరితో ఆటో డ్రైవర్ల కోసం ఆలోచించకపోతే స్థానిక సంస్థ ల ఎన్నికలలో ఓటమి తప్పదని హెచ్చరిస్తున్నామని వారు అన్నారు...

# ఎడిటోరియల్

## ఎవరి టెక్నిక్ వారిది.. తప్పించుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు

దేనికైనా టెక్నిక్ అవసరం.. రాజకీయాల్లోనూ టెక్నిక్ ఉండాలని తాజాగా ఏపీ అసెంబ్లీ నిరూపించింది. సభకు వరుసగా 60 రోజులు రాకపోతే అనర్హత వేటు వేస్తామనే టెక్నికల్ పాయింటుతో ప్రతిపక్షాన్ని బెదిరిస్తున్న కూటమి ప్రభుత్వ వ్యూహాన్ని.. అదే టెక్నికుతో ప్రతిపక్ష వైసీపీ తిప్పికొట్టింది. ఎవరికీ అంతుబట్టని విధంగా ఈ టెక్నికల్ పొలిటికల్ ఫైట్ ఆసక్తి పుట్టిస్తోంది. ఏపీ బడ్జెట్ సమావేశాలకు హాజరుకావాలా? వద్దా? అనే ఊగిసలాట మధ్య సభకు హాజరవ్వాలని షాకింగ్ డిసిషన్ తీసుకున్న వైసీపీ అధినేత జగన్.. అధికార కూటమికి అంతే షాక్ ఇచ్చారు. జగన్ ను బలవంతంగా సభకు రప్పించి.. అసెంబ్లీలో ఓ ఆట ఆడుకోవాలని చూసిన అధికార పార్టీ ఎమ్మెల్యేలకు తనదైన రాజకీయ వ్యూహంతో చెక్ చెప్పారంటున్నారు. సభకు వచ్చినట్లే వచ్చి.. వాకౌట్ చేయడం ద్వారా తన ముందు అధికార పార్టీ పాచికలు పారవని జగన్ నిరూపించారని అంటున్నారు. ప్రతిపక్ష పార్టీ హాజరుపై కొద్దికాలంగా డైలాగ్ వార్ నడుస్తున్న విషయం తెలిసిందే. స్పీకర్ చైరులో డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఉండగా, వైసీపీ నేత జగన్ ను సభలో కూర్చొబెట్టాలని అధికార పార్టీ ఉబలాటపడుతోంది. అయితే తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేగాని సభకు రానంటూ వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి భీష్మించుకున్నారు. ఈ పరిస్థితుల్లో జగన్ ను సభకు రప్పించేందుకు టెక్నికల్ అంశాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు అస్త్రంగా తీశారు. 60 రోజులు సభకు రాకపోతే చట్టప్రకారం అనర్హత వేటు వేస్తామని హెచ్చరించారు. వైసీపీకి చెందిన 11 మంది ఎమ్మెల్యేలు అనర్హత ప్రమాదాన్ని ఎదుర్కొకుండా ఉండాలంటే సభకు వచ్చితీరాల్సిందేనని రూలింగ్ ఇచ్చారు. ఇక తన డిప్యూటీ మాటలకు స్పీకర్ కూడా ఎస్.. రఘురామ చెప్పిందే నిజం అన్నట్లు తలూపడంతో రాజకీయం రసకందాయంగా మారింది. అయితే సభకు వెళ్లకుండా అనర్హత వేయించుకుని ఉప ఎన్నికలకు వెళితే నష్టమనే భావన వైసీపీలో కనిపించిందని చెబుతున్నారు. అందుకే ఏ టెక్నికుతో అయితే ప్రభుత్వం ఇబ్బంది పెట్టాలని చూసిందో.. అదే టెక్నిక్ వాడి ప్రభుత్వానికి చెక్ చెప్పాలని వైసీపీ నేతలు నిర్ణయించారు. దీంతో బడ్జెట్ సెషన్సులో ప్రారంభ కార్యక్రమం అయిన గవర్నర్ ప్రసంగానికి హాజరయ్యారు. అంటే టెక్నికల్ గా వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చినట్లే.. దీంతో 60 రోజుల బెదిరింపులకు బ్రేక్ వేసినట్లైంది. అదే సమయంలో ప్రభుత్వ బెదిరింపులకు లొంగిపోయామనే భావన వ్యక్తం కాకుండా.. గవర్నర్ ప్రసంగం ప్రారంభమైన కాసేపటికే వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అంతా వాకౌట్ చేశారు. దీంతో పొలిటికల్ టెక్నికుతో వైసీపీ తప్పించుకుందని కూటమి ఎమ్మెల్యేలు విమర్శిస్తున్నారు. ఏదైనా ఏపీలో తాజా టెక్నిక్ పాలిటిక్స్ ఇంట్రస్టింగ్ గా మారాయంటున్నారు.

## నేడు అవతార్ మెహర్ బాబాకి ప్రత్యేక అభిషేకాలు

**అత్యంత వైభవంగా అవతార్ మెహర్ బాబా ఊరేగింపు**

**పులకించిన పురవీధుల్లో అవతార్ మెహర్ బాబా కి భక్తుల నీరాజనాలు**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అవతార్ మెహెర్ బాబా 131వ జన్మదినోత్సవ వేడుకలలో భాగంగా విజయవాడసత్యనారాయణపురం, ముత్యాలంపాడు ప్రాంతం లో బాబా చిత్రపటం తో అత్యంత వైభవంగా ఊరేగింపు జరిగింది. ఈ ఊరేగింపు తో పులకించిన పురవీధుల్లో భక్తులు బాబా వారికి అడుగడుగునా నీరాజనాలు పలికారు.అనంతరం మెహెర్ బాబా కేంద్ర అధ్యక్షులు డాక్టర్ మెహెర్ ప్రసన్న మాట్లాడుతూ అవతార్ మెహెర్ బాబా 131 వ జయంతిసందర్భంగా ఈ నెల ఫిబ్రవరి 25 వ తేదీన (నేడు) తెల్లవారుఝామున 4 గంటల నుండి కార్యక్రమం జరుగుతుందని, ఉదయం 5గంటలకు బాబా జన్మించిన సమయమున బాబా కు హారతి ఇవ్వడం, అలాగే బాబా సత్యప్రేమ సందేశం, అనంతరం బాబాస్వయంగా ఇచ్చిన పాదుకులకు బాబా ప్రేమికుల చేత అభిషేకము చేయించడం జరగనుందని తెలిపారు. అలాగే ఉదయం 11.00 గంటలకు అన్నప్రసాదవితరణ, సాయంత్రం 6 గంటల నుండి కీర్తనలు, బాబా చలన చిత్ర ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో అందరూ పాల్గొని బాబా ప్రేమాశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశం లో కేంద్ర కార్యదర్శి సర్వారావు,తాడేపల్లి మెహెర్ కుమార్, వై.మెహెర్ కుమార్, జి. మెహెర్జీ, శీలం రాధాకృష్ణ మూర్తి, కె వి ఎస్ గుప్త తదితర కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

## జగన్ ఒక -జీవచ్ఛవం-ఎం.ఎం. బేగ్ ఎద్దేవా




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దురహంకారం ఎంతటి వారిని అయినా జీవచ్ఛవంలా మారుస్తుందంటానికి సోమవారం నాటి బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి హాజరైన వైకాపా అధినేత జగన్ రెడ్డిని చూస్తే అవగతమైందని తెదేపా ఎన్టీఆర్ జిల్లా తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి మీర్జా ముజఫర్ బేగ్ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సహా రాష్ట్రాన్ని ఒక రావణకాష్టంలా మారుస్తూ వికృత ఆనందం పొందిన జగన్ నేడు తన పదవిని కాపాడుకునే క్రమంలో అసెంబ్లీకి హాజరు కావడం సిగ్గుచేటన్నారు.అహం మనిషి పతనానికి ఎంతగా దారితీస్తుంది అనడానికి జగన్ రాజకీయ జీవితమే నేటి యువతరానికి ఒక ప్రత్యక్ష ఉదాహరణన్నారు.

# ఆహ్లె హదీస్ జమాత్ రాష్ట్ర అధ్యక్షునికి శుభాకాంక్షలు

**రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ ఫతాఉల్లాహ్**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జమీయతే ఆహలే హదీస్ సంస్థ ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన మౌలాన ఫజులుర్ రహమాన్ గారికి ఖిద్మత్ ఘర్ కార్యాలయంలో శాలువా కప్పి మొహమ్మద్ పతావుల్లాహ్ సత్కరించారు. ఆదివారం ఉదయం ఇస్లాంపేటలోని జామియా మసీదులో గల అహలే హదీస్ రాష్ట్ర కార్యాలయంలో అహలె హదీస్ రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వహించారు, ఈ ఎన్నిక కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 170 మంది ఓటు హక్కు గల జమయత్ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా పజులూరు రహమాన్ ని రెండవసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జమీయతే అహలే హదీస్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు .మౌలానా అబ్దుల్ గఫార్ ని ప్రధాన కార్యదర్శిగాఅలాగే ఫారుక్ ఖాన్ ని రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకోవడం జరిగినది.ఎన్నిక అనంతరం రాష్ట్ర నాయకత్వం మొహమ్మద్ ఫతావుల్లా గారి కార్యాలయం ఖిద్మత్ ఘర్ కు విచ్చేశారు. ఈ సందర్భంగా మొహమ్మద్ ఫతావుల్లా ఆయన్ని వారిని ఘనంగా సన్మానించారు.జమీయతే అహ్లెహదీస్ సంస్థ నాయకులతో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతావుల్లా మాట్లాడుతూ మీ సంస్థకు ఎటువంటి సహాయ సహకారం కావాలన్నా నేను తోడుగా ఉంటానని సంస్థ చేస్తున్న ధార్మిక సామాజిక కార్యక్రమాల్లో నేను కూడా పాలు పంచుకుంటానని మీ సంస్థ ద్వారా ధార్మిక కార్యక్రమాలతో పాటు ముస్లిం సమాజ విద్యార్థుల సమస్యలపై కూడా దృష్టి సారించాలని కోరారు.విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ చిన్ని ముస్లిం సమాజానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వారి సమస్యలపై దృష్టి సారించాలని నాకు ఆదేశించి ఉన్నారని అన్నారు, మీ సంస్థకు పార్లమెంటు సభ్యుల తరఫున అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందుతుందని మొహమ్మద్ ఫతావుల్లా తెలియజేశారు.

# ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్న మీకు నియంతలకు పట్టినగతే పడుతుంది !!

**● కూటమి ప్రభుత్వానికి వైసిపి నేత గౌస్ మొహిద్దీన్ హెచ్చరిక !!**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వ వైఖరిపైన,సూపర్ సిక్స్ హామీలపైన ప్రశ్నిస్తారనే వైసిపికి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి శాసనసభలో మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అధికార టిడిపి కూటమి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని వైసిపి నేత,జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు.మొన్నటి వరకూ వైఎస్ జగన్మోహనరెడ్డి అసెంబ్లీకి రావటం లేదంటూ ఏల్లో మీడియాలో ఊదరగొట్టిన ప్రభుత్వ పెద్దలకి,వైఎస్ జగన్ అసెంబ్లీ లోకి వచ్చేసరికి ముచ్చెమటలు పట్టాయని,అందుకనే ప్రధాన ప్రతిపక్ష నాయకుడుగా ఆయనకు ఇవ్వాల్సిన గౌరవాన్ని,మాట్లాడే అవకాశాన్ని ఇవ్వకుండా కుట్రపూరితంగా వ్యవహరించి ప్రతిపక్షం గొంతు నొక్కారని గౌస్ మొహిద్దీన్ ఎద్దేవా చేశారు.ప్రజాస్వామ్య విరుద్ధంగా ప్రధాన ప్రతిపక్షం లేకుండా తూతూమంత్రంగా తాము నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల లొసుగులు బయట పడతాయనే దేశంలో ఎన్నడూ లేనివిధంగా సాక్షి సహా నాలుగు ఇతర మీడియా ఛానళ్లకు అసెంబ్లీ కవరేజీ అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందని గౌస్ మొహిద్దీన్ మండిపడ్డారు.సమస్యలను ప్రస్తావించకుండా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహనరెడ్డి గొంతు నొక్కితేనో,నిలువుటద్దంలా సమస్యలను చూపిస్తున్న సాక్షిని నిలువరిస్తేనో అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో చెప్పిస్తున్న అబద్ధాలు నిజాలు కావని గుర్తించుకోవాలని గౌస్ మొహిద్దీన్ హితవు పలికారు.40శాతానికి పైగా ఓట్లతో ఘనమైన ప్రజామద్దతు కలిగి ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి కి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా నాటకాలు ఆడుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరును ప్రజలు,ప్రజాస్వామ్యవాదులు గమనిస్తున్నారని,ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన నియంతలు ఎంతోమంది చరిత్ర కాలగర్భంలో కలసిపోయారని,ఈ విషయాన్ని గమనించి ఇప్పటికైన కూటమి ప్రభుత్వం వైసిపి ని ప్రధాన ప్రతిపక్షంగా,వైఎస్ జగన్మోహనరెడ్డి ని ప్రధాన ప్రతిపక్ష నాయకుడి గుర్తిస్తూ ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగస్ఫూర్తిని కాపాడాలని గౌస్ మొహిద్దీన్ డిమాండ్ చేశారు.లేని పక్షంలో గత నియంతలకు పట్టినగతే తమకూ పడుతుందనే విషయం గ్రహించాలని ఈ సంధర్భంగా గౌస్ మొహిద్దీన్ హెచ్చరించారు.

# "సి. వి. ఆర్., లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**- జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ లయన్ గద్దె శేషగిరి చేతుల మీదుగా శిబిరం ప్రారంభం**





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా, అకస్మాత్తుగా ఏదైనా ప్రమాదం జరిగితే, వెంటనే కావలసింది రక్తం అని, అందుకే అన్ని దానాల్లో కెల్లా రక్త దానం గొప్ప దానం అని క్రిష్ణా జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ లయన్ గద్దె శేషగిరి అన్నారు. ఆదివారం ఉదయం లయోలా కళాశాల ఏరియాలోని వెటర్నరీ కాలనీ పార్క్ జిమ్ సెంటర్ లో చుండూరి వెంకట రెడ్డి లయన్స్ క్లబ్ (సి. వి.ఆర్.,) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన అనంతరం శేషగిరిరావు ప్రసంగించారు. కార్యక్రమానికి క్లబ్ ప్రెసిడెంట్ లయన్ పీ. వి. హనుమంత రావు అధ్యక్షత వహించారు. ఇప్పటి వరకూ 54 సేవా కార్యక్రమాలు చేసినట్లు, దీనికి ముఖ్య ప్రోత్సహం ఆర్. సి., డాక్టర్ లయన్ ఏ. శరాబంది రావు అని చెప్పారు. స్థానిక (4 వ డివిజన్) కార్పొరేటర్,పార్క్, జిమ్ దాత జాస్తి సాంబశివ రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల వల్ల సమాజంలోనీ పేదలకు, అనాధలకు, పేద విద్యార్థులకు మంచి జరుగుతుందని, రక్త దానం కార్యక్రమం చేపట్టిన క్లబ్ నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలిపారు. మాజీ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది , క్లబ్ డైరెక్టర్ లయన్ కె. సూర్య చంద్ర రావు మాట్లాడుతూ రక్త దానం చేస్తే అనారోగ్యం పాలు అవుతారని, శక్తి తగ్గుతుంది అని ప్రజలు అపోహ పడుతుంటారనీ, కానీ రక్త దానం చేస్తే అవయువాలు శుద్ధి జరిగి మళ్లి కొత్త రక్తం తయారు అవుతుందని చెప్పారు. జిల్లా రీజనల్ ఛైర్మన్ (ఆర్. సి.), డాక్టర్ లయన్ అన్నాబత్తుల శరాబంది రావు సి. వి. ఆర్ .లయన్స్ క్లబ్,జిల్లా లో గవర్నర్ సూచనల ప్రకారం సేవా కార్యక్రమాలు చేపట్టి నట్లు, మున్ముందు కూడా ఇంకా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తామని ,క్లబ్ సభ్యులు అందరూ సహకరిస్తున్నారని అన్నారు. రక్త దానం కార్యక్రమం కో ఆర్డినేటర్ లయన్ పింగళి వెంకట రమణ, క్లబ్ ట్రెజరర్ లయన్ చిన్ని రూప నాథ్ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.జిల్లా కేబినెట్ నాయకులు లయన్, హెచ్.ఎమ్., ఎమ్మెస్ ఇమామ్ బాషా, పాస్ట్ ప్రెసిడెంట్ లయన్ తాటి వెంకట నారాయణ, డైరెక్టర్లు ఎమ్. శోభన్ బాబు, తాటి సాంబశివ రావు, గొల్లపల్లి శ్రీనివాస రావు, ఎమ్. రవి ఆంజనేయులు,ఎన్. వి ఎస్. క్రిష్ణా రావు, ఆకుల లక్ష్మణ్ కుమార్, లయన్ ఇస్మాయిల్, బ్లడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లయన్ వినోద్ ,సిబ్బంది, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.అనంతరం రక్తదానం చేసిన వారిని ఘనంగా సన్మానించారు

# పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజ్ లో పూడికలు తీయటం నిరంతరం జరుగుతూ ఉండాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజ్ లో పూడికలు తీయటం నిరంతరం జరుగుతూ ఉండాలని అన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో శాఖధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజ్ లో పూడికలు తీయటం నిరంతరం జరుగుతూ ఉండాలని అధికారులను ఆదేశించారు. మైనర్, మీడియం, మేజర్ డ్రైన్ లన్ని డీసిల్టింగ్ పనులని పూర్తి చేయాలని అన్నారు. నగరాన్ని గుంతలు రహిత నగరంగా తీర్చిదిద్దాలని, నిత్యం పారిశుధ్య నిర్వహణ, డ్రైన్ల డీసిల్టింగ్ పాట్ హోల్స్ నిర్వహణ జరుగుతుండాలని అధికారులని ఆదేశించారు. నగర సౌందర్యాన్ని భంగం చేసే సర్వీస్ ప్రొవైడర్ల వైర్లను పరిశీలించి వాటిని తొలగించాలని, నగర అందాన్ని మెరుగుపరిచేందుకు నమూనాగా ఒక రోడ్డుని వైర్ లు లేకుండా భూగర్భం నుండి వెళ్లేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.రెవెన్యూ శాఖ, ప్రజారోగ్యం శాఖల సమన్వయంతో కమర్షియల్ టాక్స్, టౌన్ ప్లానింగ్ శాఖ సమన్వయంతో ఖాళీ స్థలాల నుండి హౌస్ టాక్స్ కు మారిన పనుల వివరాలు, ఇంజనీరింగ్ శాఖ సమన్వయంతో నీటి పన్ను వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పన్నులను వసూలు చేయాలని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రమ్య కీర్తన, ప్రభుదాస్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎగ్జామినేటర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, ఎకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

## కోటితీర్థం శివాలయంను పరిశీలించిన సంగం సీఐ వేమారెడ్డి.





**చేజర్ల ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** మండలంలోని కోటితీర్థం గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా ముందుగా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్ వేమారెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి జరిగే శివరాత్రి మహోత్సవ ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని బారిగేట్లు టెంట్లు వేయాలని ఆలయ సిబ్బందికి సూచించారు.ఆయన వెంట చేజర్ల ఎస్సై తిరుమలరావు హెడ్ కానిస్టేబుల్ జగన్నాథం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ విజయేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహా శివరాత్రి కల్యాణోత్సవాలు ప్రారంభం



**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి)** మహాశివరాత్రి సందర్భంగా స్థానిక వన్ టౌన్ ప్రకాశం బ్యారేజ్ వద్ద ఉన్న శ్రీ విజయేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి కళ్యాణ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత తమ్మన కృష్ణ కిషోర్– స్వాతి దంపతులచే శ్రీ స్వామివారిని పెండ్లి కుమారుని చేసే కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు బుద్దు సూర్య కుమార్ శర్మ, మేడూరి వెంకట మోహన కృష్ణ శర్మ మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి మార్చి ఒకటో తేదీ వరకు శ్రీ విజయేశ్వర స్వామి వారి దేవస్థానంలో అనేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆరోజు రాత్రి 11గంటల 15 నిమిషాలకు శ్రీ స్వామి వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వారు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కర్రె వారి ఇంట ఘనంగా తొలి జన్మదిన వేడుకలు



**గుంటూరు, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)**సీనియర్ జర్నలిస్ట్, ఏపీయుడబ్ల్యూజే గుంటూరు జిల్లా మాజీ కార్యదర్శి శ్రీ యడ్ల సునీల్ – శ్రీమతి భాగ్య రేఖ ల మేనల్లుడు శ్రీ కర్రె రిద్విక్ – శ్రీమతి సుమజ ల కుమారుడు చి. రిచి జెవిన్ ప్రభు మొదటి జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి గుంటూరు లాడ్జి సెంటర్ లోని ' నార్త్ పారిష్ కాన్ఫరెన్స్ హాల్ ' లో ఘనంగా జరిగాయి. తాత నానమ్మలు కర్రె ప్రభుదాస్, హ్యారీ ప్రసూన, బాబాయ్ – పిన్ని శ్రీ రోహిత్ – వింధ్య, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కర్రె వారి చిరంజీవిని ఆశీర్వదించారు.

## అంగన్వాడి టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం సందర్శించిన స్టేట్ కోఆర్డినేటర్.



**విజయనగరం ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)**:జ్ఞాన జ్యోతి ఎఫ్.ఎల్.ఎన్. అంగన్వాడీ టీచర్స్5వ రోజు ట్రైనింగ్ లో విజయనగరం జిల్లా,రాజాం లో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన స్టేట్ ప్రత కోఆర్డినేటర్ పి వెంకటేష్ శిక్షణను ఉద్దేశించి మాట్లాడారు. , 3నుండి 6 సంవత్సరాల పిల్లలకు శారీరక, మానసిక,మేధో అభివృద్ధి కి సంబంధించి ప్రస్తుత శిక్షణ లో ఉన్నట్లు తెలియజేసారు. అదే విధంగా అభ్యసన లోపాలను సరిచేయడానికి కూడా ఈ ట్రైనింగ్ ఉపయోగపడుతుంది అని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్. పి.లు కె.హరి ప్రసాద్, వై.భాస్కరరావు , కె. కిషోర్ కుమార్,వి.ఉషారాణి, శశికళ, బంగారమ్మ మరియు ప్రసన్న లు పాల్గొన్నారు. శిక్షణా కార్యక్రమం తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని అంగన్వాడీ టీచర్లు తెలియజేసారు.

## ఇమ్మానియేల్ బాప్టిస్ట్ చర్చలో షష్టి పుష్టి కార్యక్రమం

**యాడికి: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)**యాడికి మండలం వేములపాడు గ్రామంలోని ఇమ్మానియేలు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ సుధాకర్ బాబు ఆధ్యర్యంలో చర్చి సంఘ సభ్యులకు 7 జంటలకు షష్టి పుష్టి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏక శరీలుగా ఉన్న భార్య, భర్తలు అనుబంధం గురించి, క్లుప్తంగా వివరించారు. షష్టి పుష్టి దంపతులు ఉత్సాహంతో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పాల్గొన్నారు. పెళ్లిళ్లు చేసుకొని 30 ఏళ్ళు దాటినా జంటలకు కలకాలం నూరేళ్లు జీవించాలని పెళ్లిళ్లు చేసినట్లు తెలిపారు.

# ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో చేయాలి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో చేయాలని అన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, దుర్గా ఘాట్, పున్నమి ఘాట్, భవాని ఘాట్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివరాత్రి పండుగ సందర్భంగా వచ్చే భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే సౌకర్యాలు అన్ని కల్పించాలని, ఘాట్ల వద్ద పారిశుధ్య నిర్వహణ కోరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఘాట్లలో శాశ్వత చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలని, ఘాట్ల పారిశుధ్యం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిత్యం పారిశుధ్య నిర్వహణ జరుగుతూ ఉండాలని, ఘాట్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భవానిపురం లో గల విజయవాడ నగరపాలక సంస్థ వారి మొరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావాలని వాటిలో ఉన్న మరమ్మతులు సరిచేసి సత్వరమే ప్రజలకు అందుబాటు తీసుకొచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పున్నమి ఘాట్ లో గ్రీనరీ పెంచి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేటట్టు చూసుకోవాలని అధికారం ఆదేశించారు. విజయవాడ నగరపాలక సంస్థ ఖాళీ స్థలాలలో ప్రజలకు ఆహ్లాదపరిచే విధంగా పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ మోడల్ లో ప్రాజెక్టులు తెచ్చే విధంగా అధికారులను చర్యలు తీసుకోమని కమిషనర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి సత్యనారాయణ, పి సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూ సి డి)పి వెంకటనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, శానిటరీ సూపర్వైజర్లు ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆప్కాస్ ను రద్దు చేయాలని ఏఐటీయూసీ నిరసన




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):–** కూటమి ప్రభుత్వం ఆప్కాస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కొండపల్లి పురపాలక సంఘం కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏఐటీయూసీ పిలుపు మేరకు ఈ నెల 17 నుంచి 24 వరకు నిరసనలు తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వం ఆప్కాస్ ను రద్దు చేసి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తమ్మిశెట్టి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి నరసింహారావు, గుంజ మధుసూదనరావు, వేముల తిరుపతి రావు, నిమ్మగడ్డ జోజిబాబు, కంపా సాంబయ్య, కృష్ణ, తమ్మిశెట్టి నాగమణి, బత్తుల మల్లేశ్వరి, గుంజ నాగమణి, చదల శివకుమారి, సోదవరపు రమణ తదితరులు పాల్గొన్నారు.

# తోపుడు బండ్లు, చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):–** స్థానిక రింగ్ సెంటర్ లో తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల తరలింపునకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకుంటున్నారని, అయినా పోలీసులు, మున్సిపల్ సిబ్బంది కలిసి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చిరు వ్యాపారులపై కక్షపూరితంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. వ్యాపారులు యథావిధిగా విక్రయాలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని, లేనిపక్షంలో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

# అక్రమ వసలదారులపై ఉక్కుపాదం

**వాషింగ్టన్ :** అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తూ..ప్రత్యేక విమానాల్లో వారిని స్వదేశాలకు పంపించే కార్యక్రమాన్ని కొనసాగి స్తున్నారు. అమెరికా సార్వ భౌమత్వాన్ని పరిరక్షించడానికి అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. యూఎస్‌లో చట్టవిరుద్ధంగా ఆశ్రయం పొందుతున్న తమ పౌరులను వెనక్కి పిలుపించుకోవడానికి ప్రపంచ దేశాలు తగిన చర్యలు తీసుకొని మాకు సహకరించాలి‘ అని వైట్‌హౌస్ పేర్కొంది. అయితే ఈ చర్యలను ముందుగా వ్యతిరేకించిన కొలంబియా అనంతరం వెనక్కి తగ్గి అగ్రరాజ్యం పెట్టిన నిబంధనలకు అంగీకరించిందని వైట్‌హౌస్ పేర్కొంది. కొలంబియా వెనక్కి తగ్గి స్వదేశానికి తిరిగి వచ్చిన పౌరులను ఆహ్వానించడంతో తాము ఆ దేశంపై విధించిన సుంకాలు, పలు ఆంక్షలను నిలిపివేయనున్నట్లు అమెరికా ప్రకటించింది. ‘అమెరికాలో ఉన్న అక్రమ వలసదారులను ప్రత్యేక విమానాల్లో వారివారి స్వదేశాలకు పంపడానికి అగ్రరాజ్యం అనుసరిస్తున్న తీరుపై పలు దేశాల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవు తోంది. ఇలా వలసదారులను తీసుకొచ్చే విమా నాలను తమ దేశంలోకి అనుమతిం చమని కొలంబియా తేల్చి చెప్పింది. ‘కొలంబియా వలసదారులను తీసుకువచ్చే అమెరికా విమానాలను దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తున్నా’ అని ఆ దేశాధ్యక్షుడు గుస్తావో పెట్రో ఇటీవల పేర్కొన్నారు. వలసదారులను గౌరవంగా పంపించేందుకు అమెరికా నిబంధనలు రూపొందిస్తేనే వాటిని అనుమతిస్తామన్నారు. ఇప్పటికే అమెరికా సైనిక విమానాలను వెనక్కి పంపించినట్లు చెప్పారు.

# పట్టుదల, ప్రణాళికతో విజయం సొంతం

## జెఇఇ మెయిన్స్ లో కెబిఎన్ విద్యార్థి ప్రతిభ 99.95 పర్సంటైల్ తోజాతీయస్థాయిలో 13వ ర్యాంక్




**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24:(వార్తా ప్రభ ప్రతినిధి)**పటిష్టమైన ప్రణాళిక, లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉంటే విజయం సాధించడం చాలా తేలిక అని కె.బి.ఎన్. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ తూనుగుంట్ల శ్రీనివాసు అన్నారు. తమ కళాశాల విద్యార్థి బి.యశ్వంత్ సాయి 99.95 పర్సంటైల్ తో ఆల్ ఇండియా 13వ ర్యాంకు సాధించిన సందర్భంగా సోమవారం కళాశాలలో విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ పేదకుటుంబం నుంచి వచ్చిన యశ్వంత్ కు తమ కళాశాల కమిటీ అన్నివిధాలుగా సహకారం అందించి, జెఇఇ కోర్సులో శిక్షణ ఇచ్చిందన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యశ్వంత్ జాతీయస్థాయి ర్యాంకు సాధించడం తమ కళాశాలకు గర్వకారణంగా నిలిచిందన్నారు. కెబిఎన్ షైన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.నరేంద్ర మాట్లాడుతూ ఇంటర్ మొదటి ఏడాది నుంచి తమ కళాశాలలో జెఇఇ మీద ప్రత్యేక దృష్టి కేటాయించి, అధునాతన పద్ధతుల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థి అభిరుచిని గుర్తించి ప్రోత్సహించడంతో యశ్వంత్ విజయం సాధించినట్లు చెప్పారు. కమిటీ అధ్యక్షులు ఉసిరిక ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, కమిటీ సభ్యులు జి.రామారావు, డి.సుజాత, ఎం.వి.కె.హరగోపాల్, ఎస్.కె.పి.వి.వి. హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ నగరం పోస్టర్ రహిత నగరం

- పోస్టర్లను అతికించుట నిషేదం
- విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు విజయవాడ నగరం పోస్టర్ రహిత నగరం అయినందున బహిరంగంగా బ్యానర్లు పోస్టర్లు ఫ్లెక్సీలు అతికించడం నిషేధమని తెలిపిన నియమ నిబంధనలను అతిక్రమించిన ఒక ప్రైవేట్ హాస్పిటల్ కు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సోమవారం ఉదయం 50 వేల రూపాయల జరిమానా విధించారు. విజయవాడ నగరం పోస్టర్ రహిత నగరం అయినందున కొన్ని నియమ నిబంధనలను పాటించవలసివుంటుంది. ఇందులో భాగంగా విజయవాడ నగరం లో ప్రజారోగ్యం మరియు పర్యావరణ పరిస్థితులు ద్రుష్టిలో వుంచుకొని మరియు నగర సుందరీకరణను కాపాడుకొనుటకు నగరంలో ప్రభుత్వ మరియు ప్రైవేటు భవనములు/ ప్రహరి గోడలు/ట్రాఫిక్ డివైడర్లు/ కరెంటు పోల్స్/ ట్రాఫిక్ ఇలాండ్స్ / ఫ్లైఓవర్లు/ బ్రిడ్జిలు తదితర ప్రాంతములలో పోస్టర్లను అతికించుట నిషేదం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఇకపై ఏదైనా సంస్థల వారు తమ ప్రకటనల నిమిత్తము వాల్ పోస్టర్లను నగరంలో పైన వుదహరించిన విదముగా ఎక్కడైనా అతికించిన యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోనబడునని, వారి వద్ద నుండి అనగా ప్రకటన దారులు/ప్రింటింగ్ ప్రెస్ వారి నుండి ఒక లక్ష రూపాయల వరుకు గరిష్ట పేనాలిటి వసూలు చేయుబడునని మరియు నగరంలో ఇప్పటికె పైన ఉదహరించిన ప్రాంతములలో పోస్టర్లను అతికించిన మరియు ప్రింటింగ్ చేసిన వారలను గుర్తించటమైనదని, వారందరిపై తదుపరి చర్యలను తెసుకోనుట మరియు క్రిమినల్ కేసులు నమోదుచేయుట జరుగుతుంది అని సదరు ప్రకటన దారులు/ప్రింటింగ్ ప్రెస్ వారికీ గమనించగలరని కమిషనర్ కోరారు.

# మిద్దె తోటను పెంచుతున్న రిటైర్డ్ ప్రధానోపాధ్యాయిని





**మచిలీ పట్నం, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** కృష్ణాజిల్లా మచిలీపట్నం.... మచిలీపట్నం గాంధీ నగర్ లో హైని ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవి విరమణ చేసిన ముంతాజ్ బేగం తన ఇంటి మిద్దెపై రకరకాల పూలు, పండ్లు, కాయగూరల చెట్లను సేంద్రీయ పద్ధతులతో ఎంతో శ్రద్ధగా పెంచుతున్నానని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె బాలాజీ ను సందర్శించమని కోరి ఆహ్వానించారు. ఆయన అందుకు అనుమతించి మేడం ఇంటికి వెళ్లారు చిన్న ఇంటిలో ఇన్ని మొక్కలు ఎలా సాధ్యమైనవిని వీటికి ఎరువులు ఏమి చేస్తున్నారు అని అడిగారు కంపోస్ట్, లిక్విడ్స్, మొదలగు సహజమైన ఉల్లిపాయల తొక్కలు, ఆకులు, మట్టిలో కుళ్ళనించి తదుపరి మొక్కలకు వేస్తానని తెలియజేశారు. మామిడి, జామ, అనేక రకాల కూరగాయలు, రకరకాల పూల మొక్కలు, పెంచుతున్నారని మెచ్చుకున్నారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు కూడా సందర్శించారు. పలువురకు ఆదర్శంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ కొంతసేపు శారీరక శ్రమ చేసి ఈ విధంగా మిద్దె తోటను పెంచినట్లయితే తమ ఇంటిలోని వారి పిల్లలకు ఆరోగ్యకరమైన పళ్ళు కాయలు అందించవచ్చునని అన్నారు. సహజంగా సైన్స్ టీచర్ అయిన ఆమె మొక్కల పట్ల శ్రద్ధతో ఈ తోట తయారు చేశానని ఆమె అన్నారు. ఈ మిద్దె తోట రంగురంగుల పుష్పాలతో చుట్టుపక్కలున్న మొక్కల సముదాయాన్ని చూసి తనను ఆదర్శంగా తీసుకుంటారని కోరారు. ఈ సందర్భంగా ఆమె అతిథులను ఉచిత రీతిన సత్కరించారు.

# వక్ఫ్ బిల్లు ఆమోదం

**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) బిల్లును సమీక్షిస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) సభ్యులు ప్రతిపాదించిన అన్ని సవరణలను సోమవారం ఆమోదించింది. అయితే ఈ కమిటీలోని ప్రతిపక్ష ఎంపీలు మాత్రం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దీన్నొక ప్రహసనంగా వారు అభివర్ణించారు. ఈ సందర్భంగా జెపిసి ఛైర్‌పర్సన్ జగదాంబిక పాల్ మీడియాతో మాట్లాడుతూ.. ‘ఈ కమిటీలో వక్ఫ్ (సవరణ) బిల్లుకు సంబంధించి 44 సవరణలపై 6 నెలలపాటు చర్చించాము. అనంతరం మేము సభ్యులందరి నుంచి సవరణల్ని కోరాము. వీటికి సంబంధించి ఈరోజు జరిగిన చివరి సమావేశంలో మెజార్టీ ఆధారంగా 14 సవరణల్ని కమిటీ ఆమో దించింది. ఈ బిల్లుపై ప్రతిపక్షాలు సూచించిన ప్రతి సవరణని మేము ఓటింగ్‌కి పెట్టాము. ఆ సవరణలకి మద్దతుగా పది ఓట్లు వచ్చాయి. వ్యతిరేకంగా 16 ఓట్లు వచ్చాయి. దీంతో మెజార్టీ ఎంపీలు సూచించిన సవరణలతో ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందింది’ అని ఆయన అన్నారు. కాగా, సవరణలతో ఈ బిల్లు ఆమోదం పొందడంతో.. ప్రతిపక్ష ఎంపీలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ప్రజాస్వామ్య యుతంగా జరగాల్సిన ఈ ప్రకియను.. జెపిసి ఛైర్‌పర్సన్ నిరంకుశత్వంగా అణచివేశారని ప్రతిపక్ష ఎంపీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపి కళ్యాణ్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ.. ‘ముందుగా వారు ఏం నిర్ణయించుకున్నారో అదే ఈరోజు అమలు చేశారు. కమిటీలో మమ్మల్ని ఏమీ మాట్లాడనివ్వలేదు.

# కూండ్ల వారి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న దారపనేని, నూతంగి





**కనిగిరి ఫిబ్రవరి 24 వార్తా ప్రభ ప్రతినిధి** ప్రముఖ వ్యాపారవేత్త డైరీ వాల్స్ ఐస్ క్రీమ్స్ అధినేత కూండ్ల రామకృష్ణ, శ్రీమతి శ్యామల దంపతులు విజయవాడలోని ప్రగతి నగర్ లో నూతన గృహప్రవేశం లోకి శుభారంభం చేశారు. ఈ సందర్భంగా కూండ్ల రామకృష్ణ, శ్రీమతి శ్యామల దంపతులు, కుమారుడు కూండ్ల రవీంద్రబాబు, ధనలక్ష్మి దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని కూండ్ల వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నూతంగి వెంకటనారాయణ, నరసింహారావు, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, దారపనేని కృష్ణ, విజయవాడ 42వ డివిజన్ టిడిపి అధ్యక్షులు పొనుగుబాటి వెంకటసుబ్బయ్య, మేడసాని వెంకటేశ్వర్లు, కోయ మహేంద్ర, పోకా గోపాల్, పోక వారి బంధుమిత్రులు, కల్లూరి వారి బంధుమిత్రులు, కూండ్ల వారి బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన వధూవరులకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 24 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ లబ్బీపేటలోని ఎస్.ఎస్. కన్వెన్షన్ సెంటర్ లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు రెండో కుమార్తె లక్ష్మీ చంద్రిక, వేంకట సుబ్రహ్మణ్య సాయి కిరణ్ ల వివాహ వేడుక ఆదివారం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. హాజరైన వారిలో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, మాజీ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, ఎండి రుహుల్లా, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, మొండితోక జగన్మోహన్ రావు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజా రెడ్డి, బెల్లం దుర్గా, వివిధ రంగాల ప్రముఖులు, రాజకీయ నేతలు ఉన్నారు.

# కరాటేలో టాలెంట్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ




**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24 (వార్తా ప్రభ ప్రతినిధి):–** కరాటే దు చాంపియన్ షిప్ – 25లో కొండపల్లి టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం కరాటే టోర్నమెంట్ జరిగింది. కటా విభాగం అండర్ – 15లో షేక్ ఫరీదా సుల్తానా ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్ – 14లో ఎం.డి.యూసుబ్ ద్వితీయ, అండర్ – 13లో నీలం సందీప్ ద్వితీయ, అండర్ – 9లో షేక్ ఫౌజియా ద్వితీయ, అండర్ 14లో పటాన్ ఇలియాస్ తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, శిక్షకుడు మురళిని టాలెంట్ హైస్కూల్ అధినేత ఎస్.వి.ఎస్.ఎస్.ప్రసాద్, ప్రధానోపాధ్యాయిని ఆండాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

# వరకట్నం,గృహహింస చట్టాల్లో సంస్కరణలను కోరిన పిల్ కొట్టివేత

**న్యూఢిల్లీ :** వరకట్న, గృహహింస చట్టాల దుర్వినియోగాన్ని నిరోధించేం దుకు మార్గదర్శకాలను జారీ చేయాలంటూ దాఖలైన పిల్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యం)ని సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ”సమాజంలో మార్పు రానిదే మనం ఏమీ చేయలేం. పార్లమెంటరీ చట్టాలు ఉన్నాయి” అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు ధర్మాసనం తిరస్కరించింది. ప్రస్తుతమున్న ఈ రెండు చట్టాలు దుర్వినియోగం కాకుండా ఉండేలా వాటిని పరిశీలించి, సవరించేందుకు నిపుణుల కమిటీని నియమించాలని కోరుతూ న్యాయవాది విశాల్ తివారీ పిల్‌లో కోరారు. ఇటీవల బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసులో చట్టం దుర్వినియోగాన్ని ప్రస్తావించారు. వివాహ సమయంలో ఇచ్చిన వస్తువులు/ బహుమతులు/ నగదు జాబితాను నమోదు చేయాలని, అఫిడవిట్ రూపొందించాలని, వాటి రికార్డును వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌తో జత చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిల్ కోరింది.

# అమ్మ మనస్సును బాధ పెట్టకండి

**విద్యార్థులకు వీసీ ప్రసన్నశ్రీ హితవు**



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)**చెడువాట్ల జోలికి పోవద్దని, రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణాలు చేయాలని, తాను వీసీగా కాకుండా అమ్మలాగ చెబుతున్నానని, పిల్లలకు జరగరానిది ఏదైన జరిగితే తల్లి మనస్సు విలవిలలాడిపోతుందని, అమ్మ మనస్సును బాధపెట్టవద్దని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఇ.సి.ఇ 2023 బ్యాచ్ కి చెందిన విద్యార్థి ఎస్.శ్రీకాంత్ గత ఏడాది మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శ్రీకాంత్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ తన పెద్ద కుమారుడు తేజ్ నయన్ ను 1989లో, చిన్న కుమారుడు సిద్ధార్థ్ ను 2010 పోగొట్టుకున్నానని అన్నారు.ఒక మంచి ఇంజనీరింగ్ కాలేజ్ కట్టి ఎక్కువ మందికి ఇంజనీరింగ్ విద్యలో అవకాశం కల్పించాలంటూ తన కుమారుడు చెబుతూ ఉండేవారని గుర్తుచేశారు. దేవుడు తన జీవితంలో ఇద్దరు పిల్లలను దూరం చేసి, ఇప్పుడు ఇంత మంది పిల్లలను ఇచ్చారని అన్నారు. మీరంతా బాగా చదువుకొని తల్లిదండ్రుల అండగా నిలవాలన్నారు. ఒక బిడ్డను పోగొట్టుకుంటే ఒక అమ్మ మనసు ఎంత బాధపడుతుందో తనకు బాగా తెలుసు అన్నారు. తాను వైస్ ఛాన్సలర్ గా రాలేదని,మీ అందరికీ అమ్మలాగ వచ్చానని విద్యార్థులతో అన్నారు. చెడు అలవాట్ల జోలికి పోకూడదని,రోడ్లపై జాగ్రత్తగా ప్రయాణించాలని,తన లాగ ఇంకో తల్లి దుఃఖ పడకూడదని చెప్పారు. ఏ కారణంగానైనా ఎవరైనా దెబ్బ తగిలించుకుంటే తన మనస్సు చువుక్కు మంటుందన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు అనుభవిస్తే మీరు ఈ స్థాయికి వచ్చారని, ఏ పని చేసిన కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని అప్పుడు భవిష్యత్ ఉన్నతంగా ఉంటారని సూచించారు.రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ శ్రీకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అమ్మ మనస్సును అర్థం చేసుకొని జీవించాలని తెలియజేశారు. అనంతరం వాలీబాల్ సర్వీస్ చేసి వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుండి పది టీమ్స్ వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు బి.సుధాకిరణ్, బి.కృష్ణ, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# కీసరగుట్ట బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్లు

**పరిశీలించిన రాచకొండ పోలీస్ కమిషనర్**

**బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: సీపీ సుధీర్ బాబు**

కీసర గుట్ట, **ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)**మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సావాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు మరియు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్ల గురించి రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు బందోబస్తు విధుల్లో ఉన్న సివిల్, ట్రాఫిక్ మరియు ఇతర విభాగాల అధికారులు సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సావాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల భద్రతా పరమైన పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, విఐపీలతో పాటు సాధారణ భక్తులకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యబృందం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల సౌకర్యార్థం డాక్టర్ల బృందంతో పాటు అంబులెన్సును, బీపీ షుగర్ వంటి వాటితో పాటు ఇతర అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులతో పాటు బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది యొక్క క్షేమం కూడా తమకు అంతే ముఖ్యమని, పోలీసు సిబ్బంది అనుకోని పరిస్థితుల్లో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, అంతేకాకుండా ప్రత్యేక వైద్య చికిత్స తీసుకుంటున్న సిబ్బందికి అవసరమయ్యే మందులు కూడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరుతో పాటు వేసవి తాపానికి కొందరు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది కాబట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుధ్య ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, మహిళల కోసం ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో అన్ని వైపులా ఏర్పాటు చేసిన సిసిటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీం బృందాలు కూడా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. భారీసంఖ్యలో భక్తులు దైవదర్శనం కోసం వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి డిసిపి పివి పద్మజ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, ఐటి సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు

# ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వాలి- పాతర్ల



**మంగళగిరి: ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో ఈరోజు ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్ష హోదా ఇవ్వమని అడిగేందుకు జగన్ అసెంబ్లీకి వచ్చి పది నిమిషాల్లో సభ నుండి బయటికి వెళ్లిపోవడం సభను అవమానించడమేనని అన్నారు. జగన్ పదకొండు మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీకి వచ్చి, పది నిమిషాలు ఉండి వెళ్లిపోవడాన్ని తప్పుపట్టారు. జగన్ కు ప్రతిపక్ష హోదా కోసమే అసెంబ్లీకి వచ్చారా అని ఆయన ప్రశ్నించారు. సభ్యత్వాలు రద్దు అవుతాయని అసెంబ్లీకి వచ్చినట్లు రాష్ట్ర ప్రజలంతా చర్చించుకుంటున్నారని ఆయన తెలిపారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడకుండా, జగన్ ప్రతిపక్ష హోదా కోసమే అసెంబ్లీకి రావటం కంటే ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయడం మంచిదని సలహా ఇచ్చారు. వైసీపీ నేతలకు ప్రజా సమస్యల కంటే, ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా కోసం తాపత్రయపడటమే ఎక్కవైందని విమర్శించారు. అసెంబ్లీలో వైసీపీ సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆయన మండిపడ్డారు. గవర్నర్ ప్రసంగాన్ని వైసీపీ సభ్యులు అడ్డుకోవడం సరైన చర్య కాదని పాతర్ల రమేష్ అన్నారు.

# ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా సహించేది లేదు

**- ఫిర్యాదులు రుజువైతే ఏజెన్సీ లైసెన్సుల రద్దుకూ వెనుకాడం**
**- దీపం-2 అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయి**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)**దీపం-2 పథకం ద్వారా అందించే ఉచిత గ్యాస్ సిలిండర్లకు లబ్ధిదారుల నుంచి అదనంగా ఒక్క రూపాయి వసూలు చేసినా సహించేది లేదని, ఫిర్యాదులు రుజువైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులు రద్దుచేస్తామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు.జిల్లాలో దీపం-2 పథకం అమలు, ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలు, ఫిర్యాదులపై చర్యలు తదితరాలపై చర్చించేందుకు కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో పాటు వివిధ ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపం-2 పథకాన్ని అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలుచేసే విషయంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, పథకం అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయని, దీపం పథకం కింద ఉచితంగా పొందుతున్న సిలిండర్లకు లబ్ధిదారులు తాము చెల్లించిన నగదు



48 గంటల్లో తమ ఖాతాల్లో జమవుతోందన్నారు. ఇప్పటివరకు పథకం ద్వారా 4,05,611 మంది ఖాతాల్లో దాదాపు రూ. 32.19 కోట్లు జమయిందన్నారు. అయితే ఉచిత గ్యాస్ పథకం కింద ముందు చెల్లించే అసలు బిల్లుకు అదనంగా డెలివరీ బాయ్స్ కొంత మొత్తాన్ని వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని.. ఇలాంటి ఫిర్యాదులకు సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డీలర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా మొదటి విడతలో తొమ్మిది మంది ఎల్‌పీజీ డీలర్లకు, రెండోవిడతలో అయిదు మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 52 ఏజెన్సీలు నిబద్ధతతో సేవలందించాలని, ఏవైనా అవకతవకలకు పాల్పడితే ఏపీ పెట్రోలియం ప్రొడక్ట్స్ యాక్ట్, ఎంఆర్‌పీ యాక్ట్ తదితరాల ద్వారా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ వినియోగదారులు.. రశీదులో ముద్రించియున్న ధరకంటే అదనంగా ఒక్క రూపాయికూడా చెల్లించనవసరం లేదని, అదేవిధంగా వినియోగదారుడు గ్యాస్ సిలిండర్ తీసుకునే సమయంలో తూకంలో తేడా ఉన్నట్లు అనుమానం ఉంటే సదరు డెలివరీ బాయ్స్ ద్వారా తూకాన్ని సరిచూసుకోవచ్చన్నారు. పౌర సరఫరాలు, తూనికలు-కొలతల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.సమావేశంలో డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్యతో పాటు ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పాదగయ క్షేత్రంలో పటిష్ట ఏర్పాట్లు..



**పిఠాపురం ,ఫిబ్రవరి 24, ( వార్తాప్రభ ) :**ఈ నెల 26 న జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం దర్శనం నిమిత్తం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు.పిఠాపురం లోని పాద గయాలోగత అనుభవాలు, ప్రజలు సూచనలు, పిఠాపురం పుర ప్రముఖుల సూచనలు మేరకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి తెలిపారు.పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఇప్పటికి పలుమార్లు కో ఆర్డినేషన్ సమావేశాలు నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.శివరాత్రి నేపథ్యంలో సామాన్య భక్తుల భద్రత సౌకర్యమే లక్ష్యంగా పలు ఏర్పాట్లు చేయడం జరిగిదన్నారు.ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తుల లకు పాదగయా క్షేత్రంలో అందుబాటులో వసతి గృహం వున్నది. ఏసీ డార్మెట్రీ సైతం వినియోగంలో ఉంది.పాదగయ పుష్కరిణి చుట్టూ స్నానాదులు ఆచరించే భక్తుల సౌకర్యం కోసం కోనేటి చుట్టూ శాశ్వత ఇనుప చట్రం వుంది. దీనికి అధనంగా మరింత ఎత్తులో ప్లాస్టిక్ ఫెన్సింగ్ తాత్కాలికంగా ఏర్పాటు చేయడమైనది. పుష్కరిణి చుట్టూ మహిళలు దుస్తులు మార్చుకునేందుకు శాశ్వత, తాత్కాలిక మరుగు షెడ్లు ఏర్పాటు చేయడమైనది. భక్తుల రక్షణ కోసం కోనేటి చుట్టూ 24 మంది గజ ఈత సైతం ఏర్పాటు చేయడం జరిగింది.గజ ఈతగాళ్లను షిఫ్టు సిస్టం లో నియమించడమైనది. పుష్కరిణిలో చిన్న బోటును కూడా ఏర్పాటు చేయడమైనది. పుష్కరిణి చుట్టూ హెచ్చరిక బోర్డులు పెట్టడమైనది.పుష్కరిణి చుట్టూ మరియు ఇతర పారిశుధ్య పనుల నిమిత్తం అధనంగా వంద మంది పారిశుధ్య సిబ్బందిని, నూనె, అరటి పళ్లు, అరటి ఆకులు ఎప్పటికప్పుడు తొలగించడానికి సిబ్బందిని నియమించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.క్యూలైన్లు ప్రామాణికాలకు అనుగుణంగా పటిష్టమైన ఇనుప పైపు లైన్లతో నిర్మించడమైనది.భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని నాలుగు క్యూ లైన్లు ఏర్పాటు చేయడమైనది. ఉచిత దర్శనాలకు రెండు లైన్లు, రూ.50 మరియు రూ.20 టికెట్ దర్శనాలకు ఒక్కోటి క్యూ లైన్లు ఏర్పాటు చేయడమైనది.విఐపి లకు 26 వ తేదీ మధ్యాహ్నం 02.00 గంటల నుండి 04:00 గంటల వరకు విఐపి దర్శనం చేసుకోవచ్చని ఆయన తెలిపారు. వీఐపీలకు ఇద్దరు లైజన్ అధికారులను నియమించడం జరిగిందని వారు బి. వీర భద్రారావు, పర్యవేక్షకులు ఫోన్ నెంబర్ 9963575998, జోగా సత్యనారాయణ, కార్యనిర్వహనాధికారి ఫోన్ నెంబర్ 9948024322 లను సంప్రదించి విఐపి దర్శనం పొందవచ్చని ఆయన తెలిపారు.మహా శివరాత్రికి వాహనాలపై వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయానికి నలువైపులా కేవలం 500 మీటర్ల దూరంలోనే ఆరు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి ఏర్పాటు చేయడమైనది.ఈ సంవత్సరం ఆలయం లోపల బయట మూడు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమైనది. ఏ ఎన్ ఎం లు, ఆశా వర్కర్లు, ఆసుపత్రి వైద్య సిబ్బంది శివరాత్రి మూడు రోజులూ అందుబాటులో ఉంటారు. 108 అంబులెన్స్ లో ఆక్సిజన్, ఫ్లూయిడ్స్ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, అవసరమైన అత్యవసర మందులు తగినన్ని అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవడం జరినది. సీపీఆర్ సిబ్బందిని అందుబాటులో వుంచడమైనది.పుష్కరిణి గట్టుపై భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే జల్లు స్నానం సౌకర్యాలు, పైపులు, షవర్లు ఏర్పాటు చేయడమైనది.శివరాత్రి మూడు రోజులూ ఆలయం క్యూ లైన్లలో చిన్న పిల్లలకు పాలు, పెద్దలకు మజ్జిగ, త్రాగు నీరు పంపిణీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇదిగాక, ఆలయం బయట భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛంద, ధార్మిక సంస్థల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇవి గాక ఎనిమిది తాత్కాలిక కుళాయి. ట్యాంకులతో భక్తుల కోసం త్రాగునీరు అందుబాటులో వుంచడం జరుగుతుంది. ఉచిత ప్రసాద వితరణకు ఏర్పాట్లు చేయడమైనది.దూర ప్రాంతాలు, గ్రామాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం పరిధిలోనూ, ఆలయం బయట తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడమైనది. ఏండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని భక్తుల సౌకర్యం కోసం ఆలయం లోపల బయట చలువ పందిళ్లు ఏర్పాటు చేయడమైనది. కాళ్లు కాలకుండా భక్తులు నడిచే మార్గంలో మ్యాట్ లు ఏర్పాటు చేయడంతో పాటూ నిరంతరం వాటిని తడిపే ఏర్పాట్లు చేయడమైనది.తెల్లవారు జామున పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం ఆలయం చుట్టూ, ఆలయం బయట అధనపు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడమైనది.దూర ప్రాంతాలు, గ్రామాల నుంచి భక్తుల సౌకర్యార్థం ఆలయం పరిధి లోనూ, ఆలయం బయట తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడమైనది.భక్తులందరూ భక్తి భావంతో దర్శనాలు చేసుకోవాలని ఎవరైనా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.ఇప్పటికే జిల్లా ఎస్పీ క్యూ లైన్లు, సెక్యూరిటీ ఏర్పాట్లు పరిశీలించి తగు సూచనలు చేయడం జరిగింది. వారి సూచనల ప్రకారం అన్ని సెక్యూరిటీ ,క్యూ లైన్లు ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగింది. ప్రజలు నిరభ్యంతరంగా వచ్చి శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకుని వెళ్లాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆ ప్రకటనలో తెలిపారు.

# అలాంటి సీన్స్ కు కూడా రెడీ అంటున్న రీతూ వర్మ



కెరీర్ స్టార్టింగ్ నుంచి క్లీన్ ఇమేజ్ తో ముందుకు కొనసాగుతుంది తెలుగమ్మాయి రీతూ వర్మ. ఇప్పటివరకు తాను ఎలాంటి అసభ్యకర సీన్స్ లోనూ నటించింది లేదు. గ్లామర్ షో కూడా పెద్దగా చేయలేదు. కానీ అన్ని సందర్భాల్లో అలాంటి ఇమేజ్ పనికి రాదని రీతూకి అర్థమైంది. రీతూ ఇప్పటివరకు గ్లామర్ పాత్రలు చేయకపోవడంతో ఆమెకు పెద్ద ఛాన్సులు రావడం లేదు.రీతూకి వరుస ఆఫర్లు వస్తున్నప్పటికీ ఆమె క్లీన్ ఇమేజ్ ఉన్న పాత్రలే చేస్తూ వస్తుంది. ప్రస్తుతం రీతూ నటించిన మజాకా సినిమా ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో సందీప్ కిషన్ రీతూ వర్మకు ముద్దులు పెట్టాడు. దీంతో ఆ వీడియో ఒక్కసారిగా వైరలైపోయింది. ప్రమోషన్స్ లో భాగంగా రీతూ ఆ వీడియోపై రెస్పాండ్ అయింది.సందీప్ తనకు ముద్దులు పెట్టిన వీడియో సినిమా ప్రమోషన్స్ లో భాగమని, అయినా అలాంటి సన్నివేశాలు చేయడానికి తానేమీ వ్యతిరేకం కాదని, కథ డిమాండ్ చేస్తే హగ్, కిస్ సీన్స్ కూడా చేస్తానని చెప్తోంది రీతూ. రీతూ చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో పాటూ గతేడాది తన నుంచి వచ్చిన స్వాగ్ సినిమా గురించి రీతూ మాట్లాడింది.స్వాగ్ సినిమా చేస్తున్నప్పుడే అది అందరికీ నచ్చే జానర్ కాదని, అందరినీ మెప్పించలేదని అనుకున్నామని, ఆ సినిమాలోని డెప్త్ చాలా మంది అర్థం చేసుకోలేరని అప్పుడే తాను అనుకున్నట్టు చెప్పిన రీతూ, సినిమా రిజల్ట్ విషయంలో తనకేం బాధగా అనిపించలేదని, తన వరకు మాత్రం నటిగా ఆ సినిమా మంచి సంతృప్తినిచ్చినట్టు తెలిపింది.పెళ్లి చూపులు సినిమా తనకెంతో స్పెషల్ అని, ఫ్రెండ్స్ అంతా కలిసి చిన్న బడ్జెట్ లో చేసిన సినిమా అని, దాని రిజల్ట్ ఎలా ఉంటుందనేది ముందు అసలు ఊహించలేదని, మంచి సినిమా చేస్తున్నామనే ఆలోచనతో చేసిన సినిమా పెళ్లి చూపులు అని, కానీ రిలీజ్ తర్వాత ఆ సినిమా తమ జీవితాలను మార్చేసిందని రీతూ తెలిపింది.విజయ్ దేవరకొండ ఏదొక రోజు సక్సెస్ అవుతాడనుకున్నా కానీ ఇంత పెద్ద స్టార్ అవుతాడని ఊహించలేదని చెప్తున్న రీతూ వర్మ, పెళ్లి చూపులు2 ను కూడా తరుణ్ భాస్కర్ దర్శకత్వం వహిస్తేనే బావుంటుందని అభిప్రాయపడింది. అన్నీ కుదిరి ఛాన్స్ వస్తే విజయ్, తాను కలిసి పెళ్లి చూపులు2 చేస్తామని రీతూ తెలిపింది.

# విశ్వంభర బ్రేక్ ఇవ్వడం గ్యారెంటీనా..?



సౌత్ స్టార్ హీరోయిన్స్ లో సీనియర్ అయినా కూడా త్రిష ఇప్పటికీ స్టార్ ఛాన్స్ లు అందుకుంటూ అదరగొట్టేస్తుంది. తమిళంలో రెండు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తూ వచ్చిన త్రిష తెలుగు ఆడియన్స్ కు ఈమధ్య కాస్త దూరమైంది. ఐతే ఆ దూరాన్ని కాస్త దగ్గర చేసేందుకు మళ్లీ మెగా మూవీతో వస్తుంది. మెగాస్టార్ చిరంజీవి తో విశ్వంభర సినిమాలో ఛాన్స్ పట్టేసింది త్రిష. ఈ సినిమాతో త్రిష ఆఫ్టర్ లాంగ్ టైం టాలీవుడ్ రీ ఎంట్రీ ఇస్తుంది.ఈ సినిమా విజువల్ వండర్ గా ఉండబోతుందని తెలుస్తుంది. వి.ఎఫ్.ఎక్స్ వర్క్ కూడా చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు. ఐతే విశ్వంభర సినిమాతో త్రిష కు మరోసారి మంచి బ్రేక్ వస్తుందని చెబుతున్నారు. సినిమాలో చిరంజీవి తర్వాత త్రిష పాత్రకు అంత వెయిట్ ఉంటుందని అంటున్నారు. అంతేకాదు సినిమాలో ఆమె సీన్స్ కొన్ని అదిరిపోతాయని టాక్. త్రిష కూడా కొద్దిపాటి గ్యాప్ తర్వాత తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది కాబట్టి పాత్రకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తుందని తెలుస్తుంది.అందుకే విశ్వంభర తర్వాత త్రిషకు మళ్లీ టాలీవుడ్ లో వరుస అవకాశాలు వస్తాయని అంటున్నారు. బింబిసార తర్వాత వశిష్ట డైరెక్ట్ చేస్తున్న విశ్వంభర సినిమా పై అంచనాలు అయితే తారాస్థాయిలో ఉన్నాయి. ఈ సినిమాకు కీరవాణి మ్యూజిక్ స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తుందని అంటున్నారు.ఈమధ్య కొంత రొటీన్ కథలతో మెగాస్టార్ సినిమాలు వస్తున్నాయన్న టాక్ ఉంది. అందుకే విశ్వంభర కోసం చిరంజీవి చాలా రిస్క్ చేస్తున్నట్టు తెలుస్తుంది. సినిమా దాదాపు ముగింపు దశకు రాగా త్వరలోనే ఒక టీజర్ తో రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేస్తారని తెలుస్తుంది. చిరంజీవి విశ్వంభర సినిమాలో త్రిష తో పాటు మీనాక్షి చౌదరి, ఆషిక రంగనాథ్, ఈషా చావ్లా కూడా నటిస్తున్నారని తెలుస్తుంది.సినిమా కథ ఎంత కాన్సెప్ట్ ఓరియెంటెడ్ గా ఉన్నా మెగా ఫ్యాన్స్ చిరు నుంచి కోరుకునే డ్యాన్స్ యాక్షన్ సీన్స్ అన్ని పుష్కలంగా ప్లాన్ చేస్తున్నాడట వశిష్ట. అందుకే ఈ సినిమా మీద మెగా ఫ్యాన్స్ చాలా హోప్స్ తో ఉన్నారు. చిరంజీవి కూడా వశిష్టకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చినట్టు తెలుస్తుంది. మరి మెగా విశ్వంభర సినిమా మరోసారి మెగాస్టార్ స్టామినా ఏంటో బాక్సాఫీస్ దగ్గర చూపిస్తుందా లేదా అన్నది చూడాలి.

# మైత్రీతో చేతులు కలిపిన ప్రదీప్!

లవ్ టుడే, డ్రాగన్ సినిమాలతో మంచి హిట్లు అందుకున్న ప్రదీప్ రంగనాథన్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ సినిమా చేయనుందని మొన్నీ మధ్య వార్తలొచ్చిన విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ ప్రస్తుతం టాలీవుడ్ లోనే అగ్ర నిర్మాణ సంస్థ గా పేరు సంపాదించుకుంది. మహేష్ బాబు హీరోగా వచ్చిన శ్రీమంతుడు మూవీతో ఇండస్ట్రీకి పరిచయమైన మైత్రీ నిర్మాతలు అతి తక్కువ కాలంలోనే మంచి అభిరుచి ఉందని నిరూపించుకున్నారు. మైత్రీ నుంచి సినిమా వస్తుందంటే అందరి దృష్టి ఆ సినిమాపైనే ఉండే స్థాయికి ఆ నిర్మాణ సంస్థ ఎదిగింది.దాదాపు టాలీవుడ్ లోని అగ్ర హీరోలందరితో సినిమాలు చేసిన మైత్రీ మూవీ మేకర్స్ ఇటీవలే పుష్ప2 తో భారీ బ్లాక్ బస్టర్ ను అందుకుంది.

# ఆలపాటికి మద్దతుగా అడ్వకేట్స్



**కంకిపాడు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : ఉమ్మడి గుంటూరు కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయవాడలోని గొట్టిపాటి శివరామకృష్ణ ప్రసాద్ ఇంటి వద్ద ఉమ్మడి జిల్లాల అడ్వకేట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని మీ ఓటుని నాకు వేసి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా అడ్వకేర్స్ తమ ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు, సమస్యలను గెలిచిన తర్వాత దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని రాజేంద్రప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేర్స్ ప్రతినిధులు కాకుమాను రమేష్, గొట్టిపాటి శివరామకృష్ణ ప్రసాద్, ఎం వి ఎన్ సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకవి లో ఘనంగా జరిగిన గ్రాండ్ పేరెంట్స్ డే




**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : నేటి విద్యార్థులు పెద్ద తరం సలహాలు సూచనలు లేకపోవటంతో పక్కదారి పడుతున్నారని గ్రాండ్ పేరెంట్స్ అవశ్యకత ఎంతైనా ఉందని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం హనుమాన్ జంక్షన్ విశ్వకవి స్కూల్ లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. ఎల్. కే. జి, నుండి సెకండ్ స్టాండర్డ్ స్టూడెంట్స్ కు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు వేసిన స్కిడ్స్ కన్నీరు పెట్టించాయి. పెద్దవాళ్ళ అవశ్యకత ఎంత అవసరమో కళ్ళకు కట్టినట్లు చూపించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులను గౌరవించే విధానం తో పాటు వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఘం టా ఇందిర, వీరమాచినేని శ్రీదేవి, విద్యార్థుల తల్లదండ్రులతో పాటు గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విశ్వకవి కరస్పాండెంట్ కొమ్మినేని ముఖర్జీ , ప్రిన్సిపాల్ కొమ్మినేని అనిత నిర్వహించారు.

# వివాహ వేడుకలో కొనకళ్ల బుల్లయ్య



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : కృత్తివెన్ను మండలం చినపాండ్రాక పంచాయతీ లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వివాహ వేడుక లలో రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు వీరితోపాటు కృత్తివెన్ను మండల ప్రధాన కార్యదర్శి పిన్నెంటిర త్తయ్య మల్లేశ్వరంసర్పంచ్ చెన్నుశ్రీను ఆకునూరి రత్నం జొన్నలగడ్డ కొండ దాసరిబాలయేసు పడమటినాగు బండ్రెడ్డి ఆంజనేయులు పడమటి మోహన్ రావు పడవల రామకృష్ణ వాలిశెట్టి రాంమూర్తి దాసరి ఏడు కొండలు కోనాల సునీల్ నాని గూడవల్లి తాతయ్య రాజులపాటి రమేష్ మహమద్ వాజిద్ అమృతాలరాజు కొణతం చిన్న గూడవల్లి వెంకన్న మరియు ఎం డి బజానీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : కృత్తివెన్ను మండలం కొమాళ్ళపూడి కాపుటూరు గ్రామంలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి ప్రథమ ప్రాధాన్యత ఓటును 1 పై వేసి అఖండ విజయం చేకూర్చాలని అభ్యర్థులను కోరారు ఈ కార్యక్రమంలో పెడన నియోజవర్గం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వలవల సుబ్బారావు నాయుడు కొమాళ్ళపూడి గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి రామాంజనేయులు కృత్తివెన్ను మండల జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి వివిఎన్ నరేష్ కొప్పినేటి జనసేన నాయకులు రాయపురెడ్డి ప్రసాద్ తెలుగుదేశం నాయకులు వలవల సుబ్బారావునాయుడు ప్రత్తి హరీష్ ఏనుగు బాలాజీ కొప్పినేటి నాగమారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న తిరువీధుల శారద



**పెడన,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : అధికారంలోకి వచ్చిన తర్వాత వాగ్దానాలు గాలిలో కలిసిపోతాయి శంకుస్థాపనలు భూస్థాపితం అయిపోతాయి అన్న చందంగా ఈ కూటమి ప్రభుత్వం నాయకులు ప్రవర్తిస్తున్నారు తప్ప ప్రజా సమస్యలపై పోరాడింది లేదని ప్రజా సంక్షేమం కోసం చేసింది ఏమి లేదని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి తిరువీధుల శారద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె సాయంత్రం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి ఇప్పుడు అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు అవుతున్న ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు చేయలేకపోయారని చెబుతూ బూటకపు వాగ్దానాలతో మరల ఎమ్మెల్సీ ఎన్నికలలోకి బరిలోకి వస్తున్నారని ఇటువంటి వారికి పట్టబద్రులు సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా కృష్ణ, గుంటూరు జిల్లాల నుండి పోటీ చేస్తున్న తనకు అఖండ విజయాన్ని చేకూరుస్తే పట్టభద్రుల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వాలంటీర్ల పరిస్థితి నేడు అగమ్య గోచారంగా ఉందని గత ప్రభుత్వ హయాంలో వాలంటీర్లు పెట్టారు. నేడు ఈ కూటమి ప్రభుత్వం తొలగించడంతో లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం వచ్చిన పట్టభద్రులకు ఒరిగేది ఏమీ లేదని ఎన్నికల హామీలను గాలికి వదిలేసి నేడు కూటమి ప్రభుత్వ నాయకులు తమ అభ్యర్థికి పైపు ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా పట్టబద్రులు తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# మానవత ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : ఈ నెల 28 జాతీయ సైన్సు దినోత్సవ సందర్భంగా మానవతా హనుమాన్ జంక్షన్ శాఖ వారు తమ పరిధిలోని ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ లాభాలు నష్టాలు అనే అంశముపై పోటీలు సోమవారం మానవతా కార్యాల యంలో నిర్వహించారు. జడ్జీలుగా ఘంటా సత్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు , డాక్టర్ లలిత కామేశ్వరి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, సెక్రెటరీ పాబోలు గణేష్ బాబు, వివిధ పాటశాలల ఉపాధ్యయులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి వెల్వడం లో మహాశివరాత్రి ఉత్సవాలు

## శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన వెల్వడం బాల కోటేశ్వరస్వామి ఆలయం







**మైలవరం,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** :మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని వెల్వడం గ్రామంలో ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా వెల్వడం బాల కోటేశ్వరస్వామి ఆలయం ముస్తాబయ్యిం ది.ఆలయం ప్రాంగణంలో శివరాత్రి తిరునాళ్లు ఫిబ్రవరి 26వ తేదీ బుధవారం నుంచి మూడు రోజులపాటు జరగను న్నాయి.మొదటి రోజు ఉత్సవ విగ్రహాలను గ్రామం నుంచి ఊరేగింపుగా బాలకోటేశ్వర స్వామి గుడికి చేర్చడంతో ప్రారంభమవుతాయి.ఉదయం 4 గంటలకే మూల విరాట్ కు అభిషేకాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. పెద్ద కోనేటి లో స్నానాలు చేసి పితృ తర్పణాలు వదులుతారు. 26వ తేదీ రాత్రి ఎడ్లబండితో ప్రబల ఊరేగింపు చూసి తీరాల్సిందే. ప్రభ ఊరేగింపులో డప్పులు, కనకతప్పెటలు, సన్నాయి బ్యాండ్ మేళం, కోలాటం, ఇంకా అనేక రకాల కార్యక్రమాలతో ప్రభోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. 27 వ తేదీన స్వామి వారి కళ్యాణం మరియు రథం ఊరేగింపు, అఖండ హారతి, కూచిపూడి, భరతనాట్యం, పూల రంగడు నాటకం, 28 వ తేదీన మెగా మ్యూజికల్ గ్రాండ్ ఈవెంట్ మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 28 న ఉత్సవ విగ్రహాలను మరలా తిరిగి గ్రామంలోకి తీసుకు రావడంతో తిరునాళ్ల ముగుస్తుంది. ఈ తిరుణాలకు వివిధ ప్రాంతాల నుంచి ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

**లకిరెడ్డి బాలి రెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణ:** లకిరెడ్డి బాలిరెడ్డి కుటుంబ సభ్యులచే తిరువూరు కు చెందిన ప్రముఖ శిల్పి మోదుగు ప్రసాద్ రూపొందించబడిన కీర్తిశేషులు లకిరెడ్డి బాలి రెడ్డి కాంస్య విగ్రహ ఆవిష్కరణ 25-02-2025 సాయంత్రం 5:30 గంటలకు వెల్వడం మె యిన్ సెంటర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కచేరి చావిడి దగ్గర జరుగుతుందని లకిరెడ్డి బాలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ గుఱ్ఱాల శ్రీనివాస రెడ్డి తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు మరియు లకిరెడ్డి బాలిరెడ్డి సోదరులు విచేయుచున్నా రని తెలిపారు.గ్రామస్తులు బాలి రెడ్డి అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

IN THE COURT OF THE HON'BLE 2ND ADDL CIVIL JUDGE (SENIOR DIVISION) : AT VIJAYAWADA

O.S.No. 120/2024

BETWEEN:

Vadde Bhavani, W/o Vadde Veerabhadra Rao, Aged about 35 Years, Properties, R/o. TF No.2, D.No. 12-260/2, Nutakki Apartments, Near Innotel Hotel, Ramarappadu, Vijayawada-521108.

-------PLAINTIFF

AND

D.Swathi, D/o. Not Known, Aged about 32 Years, House Wife, C/o. 6-230/1, Addagiri Vari Street, Madhava Fashions, Opp. Gummad Towers, Ramavarappadu, Vijayawada, NTR, AP - 521 108, Phone No.8341639767.

-------DEFENDANT

పై నెంబరు దావాలో మీకు దావా సమన్లు నిమిత్తం ది.13-03-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున పై తెలిపిన తేదిన ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ, లేక ప్లీడరు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పిటిషన్ తీర్మానం జరుగునని తెలుసుకోగలరు.

//శ్రీ కోర్టు వారి అనుమతితో//

వాయిదా తేదీ :- 13.03.2025

**M/s. Royal Legal Works & Chambers**

D.No. 14-8-9, Narra Vari Street Opp. Ilapuram Hotel, Gandhi Nagar, Vijayawada-520003.

Cell No. 8886132345

# హైవేలో దోపిడీ చేసే దొంగలును అరెస్టు చేసిన కంకిపాడు పోలీసులు





**కంకిపాడు,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : హైవే పై కాపు కాశి దొంగతనాలకు పాల్పడే దోపిడీ దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు ఆరు లక్షల విలువ చేసే 5 ద్విచక్ర వాహనాలు, 10,000 నగదును, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు గన్నవరం సబ్ డివిజన్ డి.యస్. పి సిహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు లోని పోలీస్ స్టేషన్లో సోమవారం విలేకరులతో సమావేశం నిర్వహించి కేసు వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తెల్లవారుజామున మూడు గంటలకు ఇంటి నుంచి కంకిపాడు వైపు వెళుతుండగా శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ వద్దకు వచ్చేసరికి రెండు ద్విచక్ర వాహనాల్లో ఐదుగురు వ్యక్తులు వచ్చి అతను బెదిరించి వద్ద ఉన్న 10000 నగదును బలవంతంగా లాక్కున్నారు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఇటువంటి నేరాలు జరగకుండా ఉండేందుకు కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదేశాలు మేరకు, డి. ఎస్. పి పర్యవేక్షణలో, సిఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్.ఐ సందీప్, అదనపు ఎస్.ఐ తాతాచార్యులు మరియు సిబ్బంది బృందాలుగా ఏర్పడి టెక్నికల్ మరియు నాన్ టెక్నికల్ సిసి ఫుటేజ్ లను అంశాలను ఆధారం చేసుకుని ఈ రోజున 24వ తేదీన అందిన సమాచారం మేరకు ఉదయం 9 గంటలకు ఈదుపుగల్లు గ్రామం మసీదు ప్రక్కన ఎంట్రన్స్ వద్ద 2 బైకులపై ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా ఈనెల 18వ తేదీన జరిగిన దొంగతనానికి పాల్పడింది వీరే అని గుర్తించారు. వీళ్ళ విచారణలో గన్నవరం, ఆత్కూరు, పెనమలూరు, కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు బైకులు దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించినట్లు తెలిపారు. వీళ్లు విలాసాలకు అలవాటు పడి సులభ సంపాదన మోజులో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా హైవేపై వెళ్లే వారిని బెదిరించి వారి వద్ద నుంచి ఫోన్లు, బైకులు,డబ్బులను దోచుకుంటారని తెలిపారు. ముద్దాయిలు ఎర్రం శెట్టి బాల విశ్వేశ్వరరావు చిట్టినగర్, జనపాల ఫణీంద్ర కుమార్ కృష్ణలంక, జి సిద్దు లబ్బీపేట, ఎన్ మోహన్ విజయవాడ, మైనర్ బాలుడు విజయవాడ వీరిని అదుపులోకి తీసుకొని వీరు వద్ద నుంచి ఐదు బైకులు,నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వేగవంతంగా కేసును పరిష్కరించి నిందితులు పట్టుకున్న సిఐ మురళీకృష్ణ, ఎస్ ఐ సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు, సిబ్బంది చంద్రబాబు, మూర్తి,బాజీ బాబులను అభినందించి రివార్డులు అందజేశారు.

# పరిశ్రమల్లో బాయిలర్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలి

## ● విజయవాడ బాయిలర్ల తనిఖీ అధికారి జె. శ్రీనివాసరావు



**విజయవాడ,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : పరిశ్రమల్లో ఏర్పాటయ్యే బాయిలర్ ల నిర్వహణా విధానాలు తీసుకోవాల్సిన భద్రతా చర్యల పై బాయిలర్ ఆపరేటర్లకు పునఃశ్చరణ తరగతులను భోదించడం జరిగిందని విజయవాడ బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి విజయవాడ బాయిలర్ల తనిఖీ అధికారి జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా బాయిలర్ల శాఖ ఆధ్వర్యంలో కృష్ణా మరియు యన్.టి.ఆర్. జిల్లా పరిసర ప్రాంతాల్లో పనిచేయుచున్న బాయిలర్ అటెండెన్స్ (ఆపరేటర్లు) పునఃశ్చరణ తరగతులను గాంధీనగర్ లో గల కృష్ణా జిల్లా రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ లో సోమవారం నిర్వహించామన్నారు. పరిశ్రమల్లో బాయిలర్ ల నిర్వహణా విధానాలు తీసుకోవాల్సిన భద్రతా చర్యల పై, బాయిలర్ల లో వాడే నీటి వినియోగం, శుద్ధి మొదలైన అంశాలపై సుదీర్ఘ అనుభవం గల పరిశ్రమ నిష్ణాతులచే బాయిలర్ లను ఆపరేట్ చేసే బాయిలర్ ఆపరేటర్లకు శిక్షణను అందించామన్నారు. ప్రతి ఏటా జరిగే ఇటువంటి తరగతులను గతంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ గుడివాడ, హనుమాన్ జంక్షన్ మరియు కొండపల్లిలో కూడా నిర్వహిచామన్నారు. కార్యక్రమంలో విజయవాడ బాయిలర్ల ఉప ముఖ్య తనిఖీ అధికారి యం. సత్యనారాయణ తో పాటు జోసిల్ ఫ్యాక్టరీకు చెందిన షేక్ రిషావత్ ఆలీ, రాజమండ్రి ఎ.పి. పేపరు మిల్లు టెక్నికల్ ఆఫీసర్ వి.వి.వి. సత్యనారాయణ, నవభారత్ లిమిటెడ్ కు చెందిన యస్. నందకేశవరావు, రామదాసు పేపర్ బోర్డ్స్ కు చెందిన కె.యస్. పవన్ నారాయణ, స్వతంత్ర కన్సల్టంట్ యమ్. ప్రసాద్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అమూల్యమైన సలహాలను, సూచనలను అందించారు.

# ఈనెల 26 తేదీ నుండి గొల్లవిల్లిలో వాలీబాల్ పోటీలు



**అమలాపురం,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : గొల్లవిల్లిలో అరిగెల శ్రీరంగయ్య వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా మెన్స్ డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు జరుగుతాయని రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి మెట్ల రమణ బాబు అన్నారు. స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం సోమవారం జరిగింది. ఈ వాలీబాల్ పోటీలలో పలు రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొనను న్నారని ఆయన తెలిపారు. అలాగే ఉప్పలగుప్తం మాజీ జెడ్పిటిసి, టోర్నమెంట్ కమిటీ అధ్యక్షులు దేశంశెట్టి వెంకట లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గొల్లవిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 26వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు వాలీబాల్ పోటీలు జరుగుతాయని,రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ప్రముఖులు పాల్గొంటారన్నారు.ఈ సమావేశంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు,వేగిరాజు వెంకటరాజు,అరిగెల నానాజీ, మద్దింశెట్టి సురేష్,చిక్కం కాసు,ఆకుల సూర్య నారాయణ మూర్తి,గుత్తాల సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

# మాత ఉత్సవాల అన్నదాన కార్యక్రమం కు మంత్రి సారథి 25 వేలు అందజేత



**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : ఆగిరిపల్లి మండలం రాజవరం పరిధిలో వెలసినటువంటి రాజ వరప్రసాద్ మాత ఉత్సవాలకు మంత్రివర్యులు కొలుసు పార్థసారథి 25వేల రూపాయలను అన్నదాన కార్యక్రమానికి బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే ఆధ్యాత్మిక ఉత్సవాలు గ్రామ ప్రజల యొక్క ఐక్యతను తెలియజేస్తున్నాయి గ్రామ ప్రజలు శాంతి సామరస్యాలతో ఉత్సవాలు జరుపుకోవాలని అందరూ ఐక్యంగా ఉండాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు నూగొండపల్లి మాజీ సర్పంచ్ మోర్ల నాగరాజు, ఈదర సర్పంచ్ దొండపాటి ఏసు పాదం శోభనాపురం సర్పంచ్ నక్కన బోయిన వేణు తెలుగుదేశం పార్టీ నాయకులు రొంపిచర్ల గిరిధర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తల్లి ప్రేమను మరిపించిన వీసీ ప్రసన్న శ్రీ హాస్టల్స్ ను ఆకస్మిక తనిఖీ , విద్యార్థినులకు ముద్దలు తినిపించిన వీసీ



**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 24 (వార్తాప్రభ)** : ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని మెన్ అండ్ ఉమెన్ హాస్టల్స్ ను వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు.వసతి గృహంలో గదులను, వంట గదులను పరిశీలించారు.హాస్టల్ నిర్వహణ సిబ్బంది అందరూ నిబద్ధతగా పని చేయాలని,పరిశుభ్రంగా హాస్టల్ ను నిర్వహించాలని దీనిలో సిబ్బంది,విద్యార్థినంలు వ్యక్తిగత బాధ్యతగా వ్యవహరించాలన్నారు. హాస్టల్ సిబ్బంది విద్యార్థినులను సొంత పిల్లలుగా భావించాలన్నారు. భోజనం రుచిగా,శుచిగా ఉండాలని వంట వారికి తెలిపారు. మెస్ లో భోజనం చేస్తూ అక్కడ ఉన్న విద్యార్థులకు ముద్దలు పెడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వసతి గృహంలో ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకు రావచ్చునని చెప్పారు.ఇప్పటికే కొన్ని సమస్యలు గుర్తించామని వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేశామన్నారు. చిన్నతనం నుండి ఎంతో గారాబంగా పెంచుకున్న తల్లిదండ్రులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలనే ఉద్దేశంతో హాస్టల్ లో చేర్చేందుకు అంగీకరిస్తారని వారి నమ్మకాన్ని వొమ్ము చేయకూడదన్నారు. హాస్టల్ విద్యార్థులు సెల్ ఫోన్ కు దూరంగా పుస్తకాలకు దగ్గరగా జీవించాలన్నారు.వసతి గృహంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, చీఫ్ వార్డెన్ ఆచార్య డి.జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188